# సాక్షి 24|7

పశ్చిమగోదావరి

బుధవారం

3-1-2018




డిసెంబరు 31న నిషారెక్కించారు

ఆ ఒక్కరోజే రూ. 6.70 కోట్ల అమ్మకాలు

వ్యాపారులు, అబ్కారీ శాఖకు కాసుల పంట

# కొత్త కిక్కు

| 2016 డిసెంబర్‌లో విక్రయాలు | | | 2017 డిసెంబర్‌లో విక్రయాలు | | |
|---|---|---|---|---|---|
| ఏలూరు డివిజన్‌లో | రూ. 63.46 కోట్లు | | ఏలూరు డివిజన్‌లో | రూ. 83.07 కోట్లు | |
| | 1,71,135 కేసుల మద్యం బాటిల్స్ | 51,430 కేసుల బీర్లు | | 1,81,174 కేసుల మద్యం బాటిల్స్ | 72,265 కేసుల బీర్లు |
| భీమవరం డివిజన్‌లో | రూ. 55.83 కోట్లు | | భీమవరం డివిజన్‌లో | రూ. 74.54 కోట్లు | |
| | 1,51,986 కేసుల మద్యం బాటిల్స్ | 49,827 కేసుల బీర్లు | | 1,53,888 కేసుల మద్యం బాటిల్స్ | 71,398 కేసుల బీర్లు |

ఏలూరు టౌన్ :

జిల్లా వ్యాప్తంగా నూతన సంవత్సర సంబరాలకు మద్యం ప్రియులు తాగి తెగ తూగేశారు. పెగ్గుమీద పెగ్గువేస్తూ సీసాలకొద్దీ ఖాళీ చేసేశారు. వేల కేసుల బీర్లు పొంగించేశారు. 2017 సంవత్సరంలో ఏకంగా రూ.1,442 కోట్ల మేర మందు తాగేస్తే, ఒక్క డిసెంబర్‌లోనే రూ.157 కోట్ల మేరకు గుటకేశారు. ఇక డిసెంబర్ 31రాత్రి మందుబాబుల నిషా విలువ రూ.6.70 కోట్లకు చేరింది. జిల్లాలోని ఏలూరు నగరంతోపాటు పట్టణాలు, మండల కేంద్రాల్లో సైతం జనాలకు ఫుల్‌గా కిక్కు ఎక్కేసింది. భారీ స్థాయిలో మద్యం విక్రయాలు జరిగినట్లు రికార్డులు చెబుతున్నాయి. పశ్చిమలో ఏలూరు నగరంతో పాటు పట్టణాల్లోనూ భారీగా మద్యం విక్రయాలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 474 మద్యం దుకాణాలు ఉండగా,

మిగతా 2వ పేజీలో ▶

## అడుగడుగునా నిరసనలు

- తొలిరోజే అధికార పార్టీకి ఎదురుదెబ్బలు
- వృద్ధులతోనే జన్మభూమి సభలు

సాక్షి ప్రతినిధి, ఏలూరు :

జిల్లావ్యాప్తంగా మంగళవారం ప్రారంభం అయిన జన్మభూమి మా ఊరు కార్యక్రమానికి జనాదరణ లేకపోవడంతో ఎక్కువగా వృద్ధులపైనే ఆధారపడ్డారు. ఫించన్‌దార్లను ఉదయం 7 గంటలకు రమ్మని సభ అయ్యే వరకూ పింఛన్లు ఇవ్వకుండా కూర్చోపెట్టారు. సభ అయిన తర్వాత ఇక్కడ ఇవ్వడం లేదని, ఎప్పుడూ ఇచ్చే చోటకు రావాలంటూ పంపించివేశారు. చింతలపూడి మండలం ప్రగడవరం జన్మభూమి గ్రామ సభను చింతలపూడి ఎత్తిపోతల పథకం రైతులు అడ్డుకున్నారు. ఊరేగింపుగా

మిగతా 2వ పేజీలో ▶

# రోడ్డెక్కిన వర్గపోరు



విజయవిహార్ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న మంత్రి వ్యతిరేక వర్గం

- కొవ్వూరులో మంత్రి అనుకూల, వ్యతిరేక వర్గాల ర్యాలీలు
- పార్టీ నాయకులపై మంత్రి దాడి చేశారని ఓ వర్గం ఆరోపణ
- వివాదం ఎటు దారితీస్తుందోనని శ్రేణుల ఆందోళన

కొవ్వూరు:

ఎక్సైజ్ మంత్రి కేఎస్ జవహర్ సొంత పార్టీ నాయకులపైనే దాడి చేయడం, కేసు పోలీస్ స్టేషన్ వరకు వెళ్లడంతో తెలుగుదేశం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. ఒకే పార్టీలోని రెండు వర్గాలు రోడ్డెక్కడంతో వివాదం ముదిరి ఏ పరిణామాలకు దారితీస్తుందోనన్నది ఆసక్తికరంగా మారింది. సోషల్ మీడియాలో మంత్రి జవహర్‌కు వ్యతిరేకంగా అన్నదేవరపేట మాజీ సర్పంచి కాకర్ల సత్యేంద్ర ప్రసాద్, ప్రస్తుత ఉపసర్పంచి కూచిపూడి గణపతి కృష్ణ కామెంట్స్ పెట్టారని ఆరోపిస్తూ మంత్రి, అతని అనుచరులు వారిని ఇంటికి పిలిపించుకుని దాడి చేసి కొట్టడం, దూర్భాషలాడడం, చంపుతామంటూ బెదిరింపులకు దిగడం పార్టీ కార్యకర్తల్లో

మిగతా 2వ పేజీలో ▶

## అడుగడుగునా నిరసనలు

మొదటి పేజీ తరువాయి

ఈ సభ జరుగుతున్న ప్రాంతానికి చేరుకున్న రైతులు భూములకు పరిహారం పెంచాలని నినాదాలు చేశారు. ప్లకార్డులు పట్టుకుని సభలో ధర్నాకు దిగారు. బుట్టాయగూడెం మండలంలోని దొరమామిడిలో జన్మభూమి గ్రామ సభలను ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు అడ్డుకున్నారు. వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేరుస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ నిర్ణయాన్ని గ్రామ సభల్లో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలని నాయకులు కోరారు. కామవరపుకోట మండలంలో టీడీపీలోని గ్రూపు తగాదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. ఈ కార్యక్రమంలో ఏలూరు పార్లమెంట్ సభ్యులు మాగంటి వెంకటేశ్వరరావు(బాబు) పాల్గొనగా, ఎంపీపీ మద్దిపోటి సుబ్బలక్ష్మి గైర్హాజరయ్యారు. ఈ గ్రామంలో జన్మభూమి కార్యక్రమాల నుంచి ఎంపీ వెళ్ళిపోయిన అనంతరం ఎంపీపీ సుబ్బలక్ష్మి పాల్గొన్నారు. పెరవలిలో నిడదవోలు ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుకు చేదు అనుభవం ఎదురైంది. రేషన్‌కార్డులు ఉన్నా రేషన్ ఇవ్వక పోవడంపై మహిళలు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. రేషన్‌కార్డుకు ఆధార్ అనుసంధానం కావడం లేదంటూ రెండు నెలల నుంచి రేషన్ ఇబ్బడం లేదని ఎవ్వరూ పట్టించుకోవడం లేదంటూ వారు నిరసన వ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మెల్యే సమాధానం చెప్పలేక స్థానిక వీఆర్‌వోపై అసహనం వ్యక్తం చేశారు. ఇరవైఏళ్లుగా ప్రభుత్వ స్థలంలో ఇళ్ల నిర్మించుకుని నివాసం ఉంటున్నామని, తమకు పట్టాలు ఇప్పించాలని కోరుతూ ఆరికిరేవులలో జన్మభూమి కార్యక్రమంలో మహిళలు మంత్రి జవహర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. పాలకొల్లులో ప్రొటోకాల్ పాటించకపోవడంపై ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ తహసీల్దార్‌పై రుసరుసలాడారు. బ్యానర్‌లో తన ఫొటోకు ప్రాధాన్యత ఇవ్వక పోతే అమరావతిలో ప్రివిలైజ్ కమిటీకి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. టి నర్సాపురం మండలం అప్పలరాజు గూడెంలో చెరువుల ఆక్రమణలు వెంటనే తొలగించకపోతే పేదలే ఆక్రమణలకు దిగవలసివస్తుందని ఎంపీపీ శీలం వెంకటేశ్వరరావు అధికారులను హెచ్చరించారు.

# రోడ్డెక్కిన వర్గపోరు

మొదటి పేజీ తరువాయి

ఆగ్రహానికి కారణమైంది. మంగళవారం భారీ సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు కొవ్వూరు చేరుకున్నారు. మంత్రి వైఖరిని నిరసిస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. విజయవిహార్ సెంటర్‌లోని ఎన్‌టీఆర్ విగ్రహం ఎదుట బైఠాయించి మంత్రిని బర్తరఫ్ చేయాలని, మంత్రిపై కేసు నమోదు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం మెయిన్‌రోడ్డులో ఆర్డీఓ ఆఫీసు మీదుగా ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ ఎస్.వెంకటేశ్వరరావుని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇదిఇలాఉంటే మంత్రికి మద్దతుగా కొంత మంది కార్యకర్తలు సాయంత్రం కొవ్వూరులో ర్యాలీ నిర్వహించి డీఎస్పీకి వినతిపత్రం సమర్పించారు.

**ఇదీ నేపథ్యం :**

ఇంతకీ మంత్రి గారికి అంత కోపం తెప్పించిన విషయం ఏమిటంటే... బీరు హెల్త్‌డ్రింక్ అని మంత్రి జవహర్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కొందరు టీడీపీకి చెందిన కార్యకర్తలే ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో అనుచితమైన కామెంట్లు పెట్టడం వివాదానికి కారణమైంది. ఈ కామెంట్ల తతంగంపై మంత్రి పీఏ జె.వరప్రసాద్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేస్తూ అందులో ఐదు ఫోన్ నెంబర్‌లను పేర్కొన్నారు. ఇందులో అన్నదేవరపేటకి చెందిన మాజీ ఉప సర్పంచి సత్యేంద్ర ప్రసాద్ ఒకరు. కర్నూలులో ఉన్న సత్యేంద్ర ప్రసాద్ వద్దకు కొవ్వూరు సీసీఎస్ పోలీసులు వెళ్లి బలవంతంగా 41(సీ) నోటీసుపై సంతకం చేయించుకున్నారు. అసలు ఈ పోస్టింగ్‌లకు తనకు ఏవిధమైన సంబంధం లేదని, తనను కావాలనే ఇరికించారని సత్యేంద్ర ప్రసాద్ ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంలో తనను ఎందుకు ఇబ్బంది పెడుతున్నారని అడిగితే మధ్యవర్తుల ద్వారా మంత్రి తన ఇంటికి రమ్మని పిలిపించారని సత్యేంద్ర ప్రసాద్ చెబుతున్నారు. గ్రామ ఉపసర్పంచి కూచిపూడి గణపతికృష్ణతో కలిసి మంత్రి ఇంటికి వెళితే తమపై దాడిచేశారని సత్యేంద్ర ప్రసాద్ ఆరోపిస్తున్నారు. ఇదే అంశంపై సోమవారం రాత్రి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. తనపై 16 కేసులున్నాయని, నా జోలికి వస్తే పార్టీని సైతం వదులుకోవడానికి సిద్ధమని మంత్రి తమపై తీవ్ర స్థాయిలో వ్యాఖ్యానించినట్టు ఇరువురు నాయకులు ఆరోపిస్తున్నారు.



కొవ్వూరులో మంత్రికి మద్దతుగా ఎన్టీఆర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న పార్టీ కార్యకర్తలు

**ముఖ్య నాయకులంతా దూరం దూరం:**

మంత్రి జవహర్ వైఖరి అధికార పార్టీలో దుమారం రేపింది. భారీగా కార్యకర్తలు మంత్రికి వ్యతిరేకంగా కొవ్వూరు నియోజకర్గ టీడీపీ కార్యాలయానికి చేరుకున్నప్పటికీ ముఖ్య నాయకులెవరూ రాలేదు. ఉదయం మంత్రికి వ్యతిరేకంగా నిర్వహించిన ఆందోళన కార్యక్రమం, ర్యాలీలోను, అనుకూలంగా సాయంత్రం పూట నిర్వహించిన ర్యాలీలోను ముఖ్య నాయకులెవరూ పాల్గొనలేదు. మంత్రికి వ్యతిరేకంగా జరిగిన ర్యాలీలో పారిశ్రామికవేత్త పెండ్యాల అచ్చిబాబు నాయకత్వం వర్థిల్లాలంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఇక్కడ విషయం ఏమిటంటే ఇటీవల అచ్చిబాబుకి పార్టీలో తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని నియోజకర్గ సమావేశంలో జిల్లా టీడీపీ కార్యదర్శి కేవీకే రంగారావు ఆరోపించారు. ఈ నేపథ్యంలో అచ్చిబాబు పేరు స్మరించడం చర్చనీయాంశం అయ్యింది. వివాదం పెద్దది కావడంతో అధిష్టానం ఈ వ్యవహారంపై సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం. మంత్రి పత్తిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో ఒక కమిటీని ఏర్పాటు చేస్తామని మంత్రి వ్యతిరేక వర్గం నాయకులకు హామీ ఇచ్చినట్టు తెలిసింది. ఇరువర్గాలతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్టు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి.

**ఉద్రిక్తతకు దారి తీసిన వివాదం:**

ఒక వైపు మంత్రికి వ్యతిరేకంగా పట్టణ మెయిన్‌రోడ్డులో ర్యాలీ చేస్తున్న సమయంలో మంత్రి మద్దతుదారులు క్రికెట్ బ్యాట్‌లు, వికెట్లు, కర్రలు తీసుకుని దాడి చేసేందుకు రావడం ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు సకాలంలో వచ్చి గొడవ జరగకుండా అడ్డుకట్ట వేయగలిగారు. ర్యాలీ చేస్తున్న వైపుకి వారిని రాకుండా నియంత్రించారు. దీంతో కొద్ది సేపటి తర్వాత మళ్లీ డీఎస్పీ కార్యాలయానికి వెళ్లే జంక్షన్ వద్ద ఇరు వర్గాలు ఎదురుపడ్డాయి. మంత్రి వర్గీయులు అల్లూరి విక్రమాదిత్య, టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకుడు నాందెడ్ల శ్రీరామ్‌లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు వెంటనే ఇరుపక్షాలను వేర్వేరు మార్గాల ద్వారా పంపించి వేశారు. వరిగేటి కాంతరాజు, పొరోజు జయరాజు, పసలపూడి సుభాష్ చంద్రబోస్, బిక్కిన ఫణీంద్ర, టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కంఠమణి చరణ్, ఏడిద రమేష్ మంత్రికి మద్దతుగా డీఎస్పీని కలిశారు. సాయంత్రం మళ్లీ మంత్రికి మద్దతుగా జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు మద్దుకూరి రవిప్రసాద్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. తాళ్లపూడి మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎలిపే ప్రభాకరరాజు, టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోడూరి సంజీవ్, జిల్లా టీఎన్‌ఎస్‌ఎఫ్ అధ్యక్షుడు నాదెండ్ల శ్రీరామ్, మద్దిపట్ల సురేష్, సూరపనేని సురేష్, పోలుమాటి విజయ్, కడిమెట్ల రామారావు, ఎలిపే కృష్ణ చైతన్య తదితరులతో పాటు వందల మంది కార్యకర్తలు మంత్రికి వ్యతిరేకంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు.

# కొత్త కిక్కు

మొదటి పేజీ తరువాయి



39 బార్లు ఉన్నాయి. వీటికి తోడు బెల్టు షాపులు ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారు. 2017 డిసెంబర్ నెలలోనే రికార్డు స్థాయిలో అమ్మకాలు జోరుగా సాగాయి. ఒక్క నెలలోనే ఏకంగా 72 వేల కేసుల బీర్లు, 1.81 లక్షల కేసుల వివిధ బ్రాండ్ల కేసులు అమ్మకాలు జరిగాయి. రూ.157.61 కోట్లు మేర మద్యం తాగేశారు. 2016 డిసెంబర్‌లో రూ.119.29 కోట్లుగా రికార్డులు చెబుతున్నాయి. రెండు సంవత్సరాల్లో డిసెంబర్ నెలలో విక్రయాల మధ్య వ్యత్యాసం రూ.38.32 కోట్లు ఉంది.

**2017 డిసెంబర్ 31న మద్యం విక్రయాలు :**

జిల్లాలోని ఏలూరు, భీమవరం డివిజన్ల పరిధిలో మందు ఏరులైపారింది. ప్రతిరోజూ రూ.60 వేల కౌంటర్ ఉండే మద్యం దుకాణాల్లోనూ కొత్త సంవత్సర సంబరాల సందర్భంగా ఏకంగా రూ.2 లక్షలకు పైగా మందు విక్రయాలు జరిగాయి. బాగా రద్దీగా ఉండే షాపుల విషయానికి వస్తే ఆ రోజు రూ.3 లక్షల వరకూ మద్యం అమ్మకాలు చేసినట్లు చెబుతున్నారు. ఒక్కరోజులోనే జిల్లాలో రూ.6.70 కోట్ల మేర మద్యం అమ్మకాలు జరిగాయి. ఏలూరు డివిజన్‌లో రూ.3.17 కోట్లు, భీమవరం డివిజన్‌లో రూ.3.52 కోట్లు మేర విక్రయాలు జరిగినట్లు తెలుస్తోంది. ఏలూరు డివిజన్‌లో 9వేల 712లిక్కర్ కేసులు అమ్ముడైతే, 2వేల కేసుల బీర్లు తాగేశారని అంచనా. ఇక భీమవరం డివిజన్‌లో 12వేలకు పైగా మద్యం బాటిల్స్ సేల్ అవ్వగా, 896కేసుల బీర్లు చల్లగా తాగేశారు.

**2017లో జిల్లాలో మద్యం అమ్మకాలు :**

జిల్లాలో మద్యం దుకాణాలకు డిమాండ్ పెరిగిపోయింది. ప్రస్తుత వ్యాపారాల్లో లిక్కర్ బిజినెస్ టాప్ ప్లేస్‌లోకి వెళ్ళిపోతున్నట్లు కన్పిస్తోంది. కొన్ని చోట్ల మద్యం దుకాణాల యజమానులకు లాభాలు తక్కువగా ఉన్నా కొన్ని ప్రాంతాల్లో భారీ డిమాండ్ ఉన్నట్లు తెలుస్తోంది.

జిల్లా మొత్తం మీద తీసుకుంటే గత ఏడాది భారీస్థాయిలో రూ.1442.91 కోట్ల మేర మద్యం విక్రయాలు జరిగాయి. ఇదే 2016 సంవత్సరంలో రూ.1248.60 కోట్లు మందు అమ్మకాలు చేశారు. రెంటి మధ్య వ్యత్యాసమే ఏకంగా రూ.194.31 కోట్లు ఉండడం గమనార్హం. ఒక్క ఏడాదిలోనే మద్యం అమ్మకాలు ఇంత భారీగా పెరగటం ఆందోళన కలిగిస్తోంది.

- 2017లో ఏలూరు డివిజన్ – 17.70 లక్షల కేసుల మద్యం బాటిల్స్–92వేల కేసుల బీర్లు–రూ.773.33 కోట్లు
- 2016లో ఏలూరు డివిజన్ – 17.22 లక్షల కేసుల మద్యం బాటిల్స్ –79వేల కేసుల బీర్లు–రూ.666.90 కోట్లు
- 2017లో భీమవరం డివిజన్–14.65 లక్షల కేసుల మద్యం బాటిల్స్–86 వేల కేసుల బీర్లు– రూ.669.58 కోట్లు
- 2016లో భీమవరం డివిజన్–14.87 లక్షల కేసుల మద్యం బాటిల్స్–68 వేల కేసుల బీర్లు– రూ.581.69 కోట్లు.



నరసాపురం 22వ వార్డులో దగ్ధమవుతున్న ఇళ్లు


కాలి బూడిదైన ఇళ్లు



రోదిస్తున్న బంటా కూలీ చిన్నాయమ్మ, బాధితులను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు

# పేద బతుకులు బుగ్గి

**నరసాపురం:** నరసాపురం పట్టణంలోని 22వ వార్డు కొత్తకాలనీలో మంగళవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. కాలనీలో ఉన్న ఓ తాటాకింటి నుంచి ఎగసిన మంటలు క్షణాల్లో వ్యాపించాయి. ప్రమాదంలో మొత్తం ఐదు తాటాకిళ్లు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అయినా ఓ ఇంటిలోని గ్యాస్ సిలిండర్ పేలడంతో మంటలు ఒక్కసారిగా ఎగసిపడ్డాయి. దీంతో స్థానికులు మంటలను అదుపు చేయలేకపోయారు. అగ్నిమాపకశాఖ అధికారి అందే రామకృష్ణ సిబ్బందితో వచ్చి మంటలను అదుపుచేశారు. ఐదు ఇళ్లలో 14 కుటుంబాలు నివాసముంటున్నాయి. ఇంట్లో సామగ్రి అంతా కాలిబూడిదవ్వడంతో వీరంతా కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. సజ్జా మారెమ్మ, సజ్జా బుల్లిశ్రీను, బూసి చిన్నాయమ్మ, కొండ మింటు, సజ్జా శ్రీను, సజ్జా వెంకటాయమ్మ, పిల్లాటి రామలక్ష్మి, పిల్లాటి శ్యామల, చించిపు మోహన్‌కుమార్, విస్సాకు సూర్యకాంతం, మోడపాటి బంగారమ్మ, బూసిపి సింహాచలం, పిసిపి చినతల్లి కుటుంబాలకు చెందిన వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. అలబాని అచ్చమ్మ కొత్తగా ఇల్లు కట్టుకుంటుండటంతో సామగ్రి బూసిపి సింహాచలం ఇంటిలో పెట్టారు. ఆ సామగ్రి కూడా కాలిపోవడంతో ఆమె కుటుంబం కూడా కట్టుబట్టలతో మిగిలింది. ఓ ఇంట్లో పొయ్యి నుంచి మంటలు వ్యాపించినట్టు భావిస్తున్నారు.

## మిన్నంటిన రోదనలు

బాధితుల రోదనలతో ఈ ప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి. బాధితులంతా రోజువారీ కూలీలు కావడంతో అంతా పనుల్లోకి వెళ్లిన సమయంలో ప్రమాదం జరిగింది. బంటాపని చేసుకునే బూసి చిన్నాయమ్మ తన మనవరాలు పెళ్లికి రెండు రోజుల క్రితం చీటీ పాడి రూ.1.50 లక్షలు తెచ్చుకుని ఇంట్లో పెట్టుకుంది. అగ్నిప్రమాదంలో ఈ మొత్తం కాలిబూడిదవడంతో హుటాహుటిన వచ్చిన ఆమె ఇంట్లో బీరువా వెతుక్కుంటూ వెళ్లి బోరున విలపించిన తీరు కలచివేసింది. చుట్టాలింటికి వచ్చిన కొండా అశ్విని తన మూడు కాసుల బంగారు చైన్ కలిబూడిదయ్యిందని విలపించింది. ఇలా అందరి ఇళ్లలో సామగ్రితో పాటు నగదు, బంగారం కాలిబూడిదయ్యాయి. మొత్తం రూ.25 లక్షల వరకూ ఆస్తినష్టం జరిగినట్టు భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు వచ్చి బాధితులను పరామర్శించారు. ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, నరసాపురం సబ్‌కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ కూడా బాధితులను పరామర్శించారు. వార్డులోని పాఠశాల భవనంలో బాధితులకు తాత్కాలిక పునరావాసం కల్పించారు.

## మద్యం మత్తులో ఆటో ప్రమాదం

### ముగ్గురికి తీవ్రగాయాలు

**కుక్కునూరు:** మద్యం మత్తులో డ్రైవర్ అతివేగంగా నడపడంతో అదుపు తప్పి ఆటో బోల్తా కొట్టిన సంఘటన కుక్కునూరు మండలంలోని నెమలిపేట వద్ద మంగళవారం చోటుచేసుకుంది. దీంతో ఆటోలో ప్రయాణికులు తీవ్రగాయాలపాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి. వేలేరుపాడు మండలం సొందిగొల్లగూడెం, బాబు మద్దిగట్లకు చెందిన ఎనిమిది మంది గిరిజనులు ఉదయం చేపలు పట్టేందుకు దాచారం గ్రామం వచ్చారు. ఇక్కడ పనిపూర్తయిన తర్వాత తిరుగు ప్రయాణంలో ఆటోలో వెళ్తుండగా నెమలిపేట టర్నింగ్ వద్ద ఆటో అదుపు తప్పి బోల్తాకొట్టింది. బాబుమద్దిగట్లకు చెందిన ఆసి వెంకమ్మ (50)కు నడుముకు తీవ్రగాయం, సొందిగొల్లగూడెం గ్రామానికి చెందిన తెల్లం గంగరాజు (40) చేతికి, భీమయ్య తలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో చికిత్స నిమిత్తం కుక్కునూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ మద్యం మత్తులో ఆటోని నడపడమే ప్రమాదానికి కారణమని తెలిసింది.


తలకు గాయమైన భీమయ్య


తీవ్రంగా గాయపడిన వెంకమ్మ


ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

## చీటీల పేరుతో టోకరా

### రూ.2 కోట్లతో ఉడాయించిన వైనం


కొవ్వూరుపాడు పంచాయతీ వద్ద పోలీసులకు ఫిర్యాదుచేస్తున్న బాధితులు

**గోపాలపురం:** గోపాలపురం మండలం కొవ్వూరుపాడులో చీటీల పేరుతో రూ.2 కోట్లు సేకరించి ఓ వ్యక్తి పరారైన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి.. కొవ్వూరుపాడు గ్రామానికి చెందిన చిలకా శ్రీను 15 ఏళ్లుగా చీటీలు, వడ్డీ వ్యాపారం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో సుమారు 100 మంది నుంచి రూ.2 కోట్ల వరకూ నగదు సేకరించి పరారవ్వడంతో బాధితులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నమ్మకంగా ఉంటూ ఎవరికి ఏ అవసరమొచ్చినా ఆదుకునేవాడని, దీంతో తమ సొమ్ములు చిలకా శ్రీను వద్ద ఉంచామని బాధితులు గగ్గోలు పెడుతున్నారు. గతనెల 29న రాత్రి ఊరు నుంచి శ్రీను ఉడాయించినట్టు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై యు.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.



# గిరిజనులను మోసం చేస్తే ఖబడ్దార్

### ఎస్పీ రవిప్రకాష్ హెచ్చరిక

**బుట్టాయగూడెం:** పోలవరం ప్రాజెక్టు భూసేకరణ నేపథ్యంలో నిర్వాసితులకు వచ్చే పరిహారం విషయంలో గిరిజనులను మోసం చేసి సొమ్ములు కాజేయాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ ఎం.రవిప్రకాష్ తీవ్రంగా హెచ్చరించారు. మంగళవారం ఆయన బుట్టాయగూడెం పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ ప్రాంతంలో భూసమస్యలు, స్టేషన్‌లో నమోదైన కేసులు, సిబ్బంది వివరాలను ఎస్సై అల్లు దుర్గారావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మానవ సంబంధాలు పరాకాష్టగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బుకిచ్చిన విలువ మనుషులకు ఇవ్వడం లేదన్నారు. ఇటీవల భూసేకరణ పరిహారం సొమ్ములకు సంబంధించి దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. సొమ్ముల కోసం హత్యలు చేసేందుకు కూడా వెనుకాడటం లేదన్నారు. హత్యలు చేస్తే సొమ్ములు రావని, జైలులో మగ్గిపోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పరిహారం సొమ్ముల భద్రత, మానవ సంబంధాలపై పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఐదు మండలాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా డీఎస్పీ ఏటీవీ రవికుమార్, సీఐ ఎం. రమేష్‌బాబుకు ఆదేశాలు ఇచ్చామని ఎస్పీ రవిప్రకాష్ చెప్పారు.


బుట్టాయగూడెం పోలీస్‌స్టేషన్‌లో వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ రవిప్రకాష్

### సొమ్ముల కోసమే హత్య

బుట్టాయగూడెం మండలం చిన్నజీడిపూడి కాలనీలో సోమవారం జరిగిన హత్య కూడా పరిహారం సొమ్ము కోసమే అని చెప్పారు. మృతుడు నాగేశ్వరరావుకు పరిహారం సొమ్ముగా రూ.30 లక్షల వరకూ వచ్చే అవకాశం ఉందని, ఇప్పటికే రూ.1.50 లక్షలు వచ్చిందన్నారు. ఈ సొమ్ముల కోసం కుటుంబ తగాదాలు కూడా జరుగుతున్నట్టు దర్యాప్తులో తేలిందన్నారు. రెండు రోజుల్లో హత్యచేసిన వారిని అరెస్ట్ చేస్తామని ఎస్పీ పేర్కొన్నారు.

### కోడిపందేలను ఉపేక్షించం

సంక్రాంతి పండగ పేరుతో కోడిపందేలు వేస్తే కఠిన చర్యల తప్పవని ఎస్పీ రవిప్రకాష్ ఈ వ్యవహారానికి సంబంధించి సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నడుచుకుంటామన్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకూ 600 కేసులు నమోదు చేశామని, 500 కత్తులు సీజ్ చేసి 400 మందిని బైండోవర్ చేశామని చెప్పారు. సంక్రాంతి సంప్రదాయం అంటే కబడ్డీ, వాలీబాల్, పరుగు పందేలు, ముగ్గులు, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించడమని అన్నారు.

## నక్సల్స్ కదలికలపై ప్రత్యేక నిఘా

పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో నక్సల్స్ కదలికపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా నుంచి వచ్చిన మావోయిస్టులు వేలేరుపాడు మండలాన్ని షెల్టర్ జోన్‌గా వాడుకుంటున్నట్టు గుర్తించామన్నారు. బుట్టాయగూడెం మండలంలోని అలివేరు, లంకపాకల, చింతకొండ, ఎర్రాయిగూడెం తదితర ప్రాంతాల్లో న్యూడెమోక్రసీ కదలికలపై కూడా దృష్టిసారించడంతో పాటు ముమ్మరంగా కూంబింగ్ చేస్తున్నామని చెప్పారు. తాను మారుమూల గ్రామాల్లో సైతం పర్యటించి అక్కడి పరిస్థితులపై పూర్తి సమాచారం తెలుసుకున్నట్టు వివరించారు.

## హత్యకేసు దర్యాప్తు ముమ్మరం

**బుట్టాయగూడెం:** మండలంలోని చిన్నజీడిపూడి కాలనీలో జరిగిన హత్య కేసుకు సంబంధించి పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఇప్పటికే పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్న అధికారులు మంగళవారం ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిసింది. ఆస్తి కోసం జరిగిన హత్యగానే పోలీసులు భావిస్తున్నారు. పోలవరం డీఎస్పీ ఏటీవీ రవికుమార్, సీఐ ఎం.రమేష్‌బాబు కేసు దర్యాప్తులో పాల్గొన్నారు. ఎస్పీ ఎం.రవిప్రకాష్ కేసు వివరాలు తెలుసుకోవడంతో పాటు మంగళవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బుధవారం నాటికి హత్యకు దారితీసిన పూర్తి వాస్తవాలు తెలుస్తాయని పోలీసు వర్గాలు భావిస్తున్నాయి.

## భవిష్యం

**మేషం:** వ్యయ ప్రయాసలు. బంధువులతో మాటపట్టింపులు. దేవాలయాలు సందర్శిస్తారు. అనుకోని ఖర్చులు. వృత్తి, వ్యాపారాలలో ఇబ్బందులు.

**వృషభం:** కొత్త కార్యక్రమాలకు శ్రీకారం. శుభవార్తలు. మిత్రుల నుంచి ధనలాభం. విలువైన వస్తువులు సేకరిస్తారు. వ్యాపారాలలో లాభాలు. ఉద్యోగులకు పనిభారం తగ్గుతుంది.

**మిథునం:** ఆదాయానికి మించి ఖర్చులు చేస్తారు. పనుల్లో జాప్యం జరగవచ్చు. కష్టపడ్డా ఫలితం ఉండదు. కుటుంబ సభ్యులతో విభేదాలు రావచ్చు. వ్యాపార, ఉద్యోగాలు మందకొడిగా సాగే అవకాశం ఉంది.



**కర్కాటకం:** విద్యార్థులకు అనుకూల సమాచారం. విందువినోదాలు. కార్యసిద్ధి. పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారాలలో ఊహించని లాభాలు. ఉద్యోగులకు పదోన్నతులు.

**సింహం:** మిత్రులతో కలహాలు. కొత్త రుణాలు చేస్తారు. ఆకస్మిక ప్రయాణాలు. పనుల్లో ఆటంకాలు. వ్యాపారాలు, ఉద్యోగాలు నిరాశ పరుస్తాయి.

**కన్య:** దూరపు బంధువుల కలయిక. విందువినోదాలు. చిన్ననాటి సంఘటనలు గుర్తుకు వస్తాయి. శుభవార్తలు. వృత్తి, వ్యాపారాలు సాఫీగా సాగుతాయి.

**తుల:** సన్నిహితులతో వివాదాలుసర్దుబాటు కాగలవు. ఆర్థికాభివృద్ధి. పనుల్లో పురోగతి. శుభకార్యాలకు హాజరవుతారు. వ్యాపార, ఉద్యోగాలలో అనుకూలత.

**వృశ్చికం:** ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయి. ఆలయాలు సందర్శిస్తారు. వ్యయప్రయాసలు. కుటుంబసభ్యులతో వివాదాలు. వృత్తి, వ్యాపారాలు సాధారణంగా ఉంటాయి.

**ధనుస్సు:** మిత్రులతో మాటపట్టింపులు. శ్రమాధిక్యం. పనులు ముందుకు సాగవు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. వృత్తి, వ్యాపారాలలో చికాకులు పెరుగుతాయి.

**మకరం:** ఇంటాబయటా అనుకూలం. కొత్త విషయాలు తెలుసుకుంటారు. పరిచయాలు పెరుగుతాయి. ఉద్యోగులు సమర్థత చాటుకుంటారు. వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి.

**కుంభం:** వ్యవహారాలలో విజయం. ఆహ్వానాలు రాగలవు. ఆస్తి వివాదాల నుంచి విముక్తి. సంఘంలో గౌరవం. వ్యాపారాలు, ఉద్యోగాలలో కొత్త అవకాశాలు.

**మీనం:** మిత్రులతో కలహాలు. దూర ప్రయాణాలు. కుటుంబంలో ఒత్తిడులు. ఆలయాల సందర్శన. వ్యాపారులకు ఒత్తిళ్లు. ఉద్యోగులు పనిభారంతో సతమతమవుతారు.

– సింహంభట్ల సుబ్బారావు

# రెరా చట్టం స్థిరాస్తి కొనుగోలుదారులకు వరం

నిడమర్రు :

ఏదైనా వెంచర్‌లో ఫ్లాట్ బుక్ చేసుకుంటే నిర్మాణదారుడు మనకు ఎప్పుడు అప్పగిస్తాడో తెలియదు. ఒకవేళ డబ్బు తీసుకుని మనకు ఇంటిని సరైన సమయానికి అప్పగించకపోయినా ఏమీ చేయలేని దుస్థితి. తీసుకున్న బ్యాంకు రుణంపై వడ్డీ పెరిగిపోతుంది. ఈ నేపథ్యంలో కేంద్రం ఇటీవల కొత్తగా రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా) చట్టాన్ని తీసుకువచ్చింది. స్థిరాస్తి రంగంలో రెరా చట్టం ప్రభావం తెలుసుకుందాం.




**నియంత్రణ అధికారుల వద్ద నమోదు**

ఈ చట్ట ప్రకారం చేపడుతున్న ప్రాజెక్టులను, ఇప్పటికే కంప్లీషన్ సర్టిఫికెట్(సీసీ) అందుకోని ప్రాజెక్టులను, కొత్త ప్రాజెక్టులను నియంత్రణ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలి. దీంతో నిర్మాణరంగంలోని బిల్డర్లు చేసే మోసాల నుంచి కొనుగోలుదారులను రక్షించవచ్చు. ఇంతకుముందు కోర్టు కేసులు, వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించి మాత్రమే వినియోగదారులు తమకు రావాల్సిన డబ్బును రాబట్టుకునేందుకు వీలుండేది. ఇకపై ఈ ప్రయాసలకు కాస్త విముక్తి కలుగుతుంది.

**రెరా చట్టంలోని కీలక ప్రతిపాదనలు**

బిల్డర్లు తాము చేపట్టిన ప్రాజెక్టుల కోసం ప్రత్యేక(ఎస్క్రో) ఖాతాను నిర్వహించాల్సి ఉంటుంది. పెట్టుబడిదారుల, కొనుగోలుదారుల నుంచి సేకరించిన డబ్బుల్లో 70 శాతం అదే ఖాతాలో ఉండాల్సిందే. ఈ సొమ్మునంతా ప్రాజెక్టు నిర్మాణానికి, భూమి కొనుగోలుకు వెచ్చించాల్సి ఉంటుంది. ఒక్క ఫ్లాట్ అమ్మిన తర్వాత దాని నిర్మాణంలో ఏమైనా మార్పులు చేయాల్సి వస్తే తప్పనిసరిగా బిల్డర్ కొనుగోలుదారు నుంచి రాతపూర్వక అనుమతి తీసుకోవాలి. దీంతో మధ్యలోనే మళ్లీ ధరలు పెంచే అవకాశం ఉండదు.

**ప్రతీ దశా ప్రాజెక్టు కిందే**

ఈ చట్టం ప్రకారం భవన నిర్మాణంలోని ప్రతి దశా ప్రత్యేక ప్రాజెక్టు కింద లెక్క, ప్రతి దశకూ రిజిస్ట్రేషన్ చేయించుకుని ఆ దశలను సకాలంలో పూర్తి చేయాల్సి ఉంటుంది.

**సమాచారం అందుబాటులో..**

ప్రతి బిల్డర్ ప్రాజెక్టు ప్లాన్, లేఅవుట్, ప్రభుత్వ అనుమతులు, ప్రాజెక్టు నిర్మించే భూమిపై హక్కు, ప్రస్తుత స్థితిగతులు, ప్రాజెక్టు ఉప కాంట్రాక్టర్ల వివరాలు, ఎప్పటిలోగా పూర్తవుతుందనే వివరాలను ఆయా రాష్ట్రాల నియంత్రణ సంస్థలకు సమర్పించాలి. ఫ్లాట్ కొనుగోలుకు ముందే కొనుగోలుదారులు ఈ వివరాలను ఆయా సంస్థల నుంచి ఎప్పుడైనా తెలుసుకునే వీలు ఉంటుంది.

**నిర్మాణదారులకు జైలు, జరిమానా**

రెరా చట్టం కింద ఏర్పాటు చేసిన అప్పీలేట్ ట్రిబ్యునల్ ఇచ్చే ఆదేశాలను పాటించని బిల్డర్ లేనిపక్షంలో మూడేళ్ల వరకూ జైలు శిక్ష అనుభవించాలి. అక్కడ కేసు తీవ్రతను బట్టి జరిమానా సైతం ఉండొచ్చు. అలాగే ఈ చట్టం ప్రకారం కొనుగోలుదారుడికి ఫ్లాట్ చేతికందిన ఏడాది సమయం వరకూ తలెత్తే నిర్మాణ లోపాలను సరిదిద్దే బాధ్యత బిల్డర్ తీసుకోవాల్సి ఉంటుంది.

**గత ఏడాది మే 1 నుంచి అమల్లో**

స్థిరాస్తి అమ్మకాలు, కొనుగోళ్లలో పారదర్శకత పాటించేలా.. అలాగే బాధ్యతారాహిత్యానికి నిర్మాణదారులను బాధ్యులను చేసేలా కేంద్రం చేసిన స్థిరాస్తి నియంత్రణ అభివృద్ధి చట్టం (రెరా) గత ఏడాది మే 1 నుంచి అమల్లోకి వచ్చింది.

**బుకింగ్ సొమ్ము ఇలా..**

కొంతమంది బిల్డర్లు పూర్తి నిర్మాణ ఖర్చుల్లో 10 శాతం కంటే ఎక్కువ సొమ్మును బుకింగ్ కోసం అడుగుతారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో అమ్మక ఒప్పందం తర్వాత జరుగుతోంది. కానీ రెరా చట్టం ప్రకారం ప్రమోటర్లు 10 శాతం కంటే ఎక్కువ సొమ్మును డిమాండ్ చేయకూడదు. మొదట సేల్ అగ్రిమెంట్‌ను కుదుర్చుకోవాల్సిందే.

**ఆలస్యం జరిగితే..**

ప్రాజెక్టు నిర్మాణంలో ఆలస్యం జరిగితే బ్యాంకు రుణం మీద వడ్డీ కట్టాల్సిన బాధ్యత నిర్మాణదారుడిపై పడుతుంది. దీంతో వినియోగదారునికి వడ్డీ భారం తగ్గుతుంది.

## ధరలు

**చేపలు** (భీమవరం) (కేజీ రూ.)

శీలావతి–105 కట్ల–105

**వనామీ రొయ్యలు** (భీమవరం)

30 కౌంటు 430, 40 కౌంటు 375
50 కౌంటు 345, 60 కౌంటు 315
70 కౌంటు 300, 80 కౌంటు 280
90 కౌంటు 260, 100 కౌంటు 240

**నిమ్మకాయలు** (ఏలూరు)

గరిష్టం : 1700 కనిష్టం : 1000
సగటు : 1300

## ఏలూరు వాతావరణం

గరిష్టం : 29.8 | కనిష్టం : 20.9

**నేడు :** ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. తేమ వాతావరణంతో పగలు ఆహ్లాదకరం. రాత్రి ఆకాశం నిర్మలం
గరిష్టం 30 డి.సె. కనిష్టం 21 డి.సె.

**రేపు:** పిల్ల గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతం. తేమ వాతావరణంతో పగలు ఆహ్లాదం. రాత్రి ఆకాశం నిర్మలం.
గరిష్టం 31 డి.సె. కనిష్టం 20 డి.సె.

**శుక్రవారం :** పిల్ల గాలులు వీస్తాయి. పాక్షికంగా మేఘావృతం. తేమ వాతావరణంతో పగలు ఆహ్లాదం. రాత్రి ఆకాశం నిర్మలం.
గరిష్టం 31 డి.సె. కనిష్టం 21 డి.సె.

## తిరుమల సమాచారం

తిరుమలలో మంగళవారం భక్తుల రద్దీ మోస్తరుగా ఉంది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 15 కంపార్ట్‌మెంట్లు నిండాయి.



**సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం :**

**గదుల వివరాలు:**

| | |
|---|---|
| ఉచిత గదులు | – ఖాళీ లేవు |
| రూ.50 గదులు | –5 ఖాళీ ఉన్నాయి |
| రూ.100 గదులు | –20 ఖాళీ ఉన్నాయి |
| రూ.500 గదులు | – ఖాళీ లేవు |

**సేవలు**

| | |
|---|---|
| సహస్ర దీపాలంకరణ | – ఖాళీ లేవు |
| వసంతోత్సవం | – ఖాళీ లేవు |
| ఆర్జిత బ్రహ్మోత్సవం | – ఖాళీ లేవు |

బుధవారం ప్రత్యేక సేవ : సహస్రకలశాభిషేకం

## తాడేపల్లిగూడెం రైల్వే సమాచారం

### విజయవాడ వైపు

| | | | | | |
|---|---|---|---|---|---|
| 12739 | విశాఖపట్నం– సికింద్రాబాద్ | 00:13 | 12863 | హౌరా – యశ్వంత్‌పూర్ | 14:28 |
| 12703 | హౌరా – సికింద్రాబాద్ | 01:09 | 57226 | విశాఖపట్నం– విజయవాడ | 14:41 |
| 11020 | భువనేశ్వర్–ముంబై(సీఎస్‌టీ) | 02:33 | 13351 | ధన్‌బాద్ టాటానగర్–అలెప్పీ | 15:28 |
| 67262 | రాజమండ్రి – విజయవాడ | 04:43 | 12717 | విశాఖపట్నం– విజయవాడ | 16:19 |
| 57272 | రాయగడ – విజయవాడ | 05: 00 | 18047 | హౌరా –వాస్కోడిగామా | 16:27 |
| 57232 | కాకినాడ పోర్ట్ – విజయవాడ | 07:11 | 18463 | భువనేశ్వర్– బెంగళూరు సిటీ | 16:56 |
| 17206 | కాకినాడ – సాయినగర్ | 07:58 | 17488 | విశాఖపట్నం– తిరుపతి | 18:05 |
| 12841 | హౌరా – చెన్నై సెంట్రల్ | 08:16 | 12839 | హౌరా – చెన్నై సెంట్రల్ | 18:16 |
| 18645 | హౌరా–హైదరాబాద్ | 08:27 | 12842 | చెన్నై సెంట్రల్ –హౌరా | 18:40 |
| 12805 | విశాఖ – సికింద్రాబాద్ | 09:56 | 67299 | రాజమండ్రి– విజయవాడ | 18:23 |
| 57258 | కాకినాడ – తిరుపతి | 10:23 | 12861 | విశాఖపట్నం– నిజాముద్దీన్ | 19:00 |
| 17221 | కాకినాడ –లోకమాన్య | 10:28 | 12727 | విశాఖపట్నం– హైదరాబాద్ | 21:28 |
| 17240 | విశాఖపట్నం– గుంటూరు | 11:29 | 12737 | కాకినాడ – సికింద్రాబాద్ | 22:24 |
| 12803 | విశాఖపట్నం–నిజాముద్దీన్ | 11:53 | 12830 | భువనేశ్వర్ – చెన్నై | 22:06 |
| 22807 | సంత్రాగచ్చి – చెన్నై | 11:57 | 18509 | విశాఖపట్నం– నాందేడ్ | 23:20 |

### విశాఖపట్నం వైపు

| | | | | | |
|---|---|---|---|---|---|
| 12728 | హైదరాబాద్–విశాఖపట్నం | 00:40 | 12864 | యశ్వంత్‌పూర్–హౌరా | 10:58 |
| 12740 | సికింద్రాబాద్–విశాఖపట్నం | 03:13 | 17238 | గుంటూరు– విశాఖపట్నం | 11:13 |
| 18048 | వాస్కోడిగామా– హౌరా | 04:17 | 12804 | నిజాముద్దీన్–విశాఖపట్నం | 12:38 |
| 12738 | సికింద్రాబాద్– కాకినాడ పోర్టు | 04:38 | 12806 | సికింద్రాబాద్–విశాఖపట్నం | 14:58 |
| 17487 | తిరుపతి – విశాఖపట్నం | 04:58 | 57257 | తిరుపతి– కాకినాడ పోర్టు | 15:03 |
| 18510 | నాందేడ్ – విశాఖపట్నం | 05:13 | 11019 | ముంబై– భువనేశ్వర్ | 15:38 |
| 12829 | చెన్నై– భువనేశ్వర్ | 05:33 | 22808 | సంత్రాగచ్చి–చెన్నై | 15:48 |
| 67300 | విజయవాడ– రాజమండ్రి | 06:58 | 12842 | చెన్నై–హౌరా | 16.38 |
| 12718 | విజయవాడ – విశాఖపట్నం | 07:22 | 17205 | సాయినగర్‌షిర్డీ–కాకినాడ టౌన్ | 16: 58 |
| 12840 | చెన్నై – హౌరా | 07:58 | 18646 | హైదరాబాద్ – హౌరా | 18:14 |
| 18464 | బెంగళూరు– భువనేశ్వర్ | 08:13 | 57231 | విజయవాడ– కాకినాడ పోర్టు | 19:23 |
| 12864 | నిజాముద్దీన్ – విశాఖపట్నం | 08:23 | 67261 | విజయవాడ–రాజమండ్రి | 20:43 |
| 13352 | అలెప్పీ–టాటానగర్ | 08:48 | 12704 | సికింద్రాబాద్–హౌరా | 22:59 |
| 17222 | లోకమాన్యతిలక్–కాకినాడ | 10:24 | 57271 | విజయవాడ–రాయగడ | 23:19 |
| 57225 | విజయవాడ–విశాఖపట్నం | 10:52 | | | |

## బుల్లితెర

W


**SAKSHI TV**

ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్
ఉ.06.30 గుడ్ మార్నింగ్
ఉ.07.30 కేసీఆర్ లైవ్ షో
ఉ.08.30 న్యూస్ ఫీచర్
ఉ.09.00 రీజనల్ న్యూస్
ఉ.09.30 మ్యాగజీన్ స్టోరీ
ఉ.10.00 సాక్షి న్యూస్
ఉ.10.30 న్యూస్ ఫీచర్
మ.02.30 డాక్టర్స్ టైమ్
సా.04.30 మార్గం
సా.05.00 స్పీడ్ న్యూస్
సా.05.30 ఉద్యోగ న్యూస్
రా.07.30 పొలిటికల్ కారిడార్
రా.08.00 ఫోర్త్ ఎస్టేట్
రా.09.00 న్యూస్ 360
రా.09.30 మ్యాగజీన్ స్టోరీ
రా.10.30 స్పోర్ట్స్
రా.11.30 న్యూస్ ఫీచర్

### టీవీలో ఈరోజు సినిమాలు




**జెమిని మూవీస్**
ఉ.07.00 పాండు
ఉ.09.30 కొడుకు
మ.12.00 అన్నయ్య
సా.06.00 నాయకుడు
రా.09.00 శ్రీరామ్



**మూవీస్ నౌ**
ఉ.08.55 ఫోర్డ్
మ.01.35 ద మాస్క్
మ.03.15 డై అనదర్ డే
సా.05.30 ఫైనల్ డెస్టినేషన్ 3
రా.09.00 రష్ అవర్ 3



**హెచ్‌బీవో**
ఉ.06.00 మునిచ్
ఉ.08.47 ద అకౌంటెంట్
మ.01.47 టవర్ ఆఫ్ డెత్
సా.05.01 ఐరన్ మ్యాన్
రా.09.00 సూసైడ్ స్క్వాడ్



**స్టార్ మూవీస్**
ఉ.08.16 ద వోల్వరిన్
ఉ.10.40 జూటాపియా
మ.12.38 ప్రిడేటర్
సా.04.43 కుంగ్‌ఫు పాండా 3
రా.09.00 స్పైడర్–మ్యాన్



**మా మూవీస్**
ఉ.07.00 రామదండు
ఉ.09.00 ఎస్.పి.పరశురాం
మ.12.00 మొదటి సినిమా
సా.06.00 నువ్వు లేక నేను లేను
రా.09.00 మన్మథ



**జీ సినిమా**
ఉ.04.45 షాదీ సే పెహ్లే
ఉ.08.30 దిలదార్ ద ఆర్య
ఉ.11.28 హసీనా మాన్ జాయేగీ
రా.09.00 బిజినెస్‌మ్యాన్ 2
రా.11.54 త్రిపుర



**బంగారం** (10 గ్రాములు)
(నరసాపురం)
24 క్యారెట్లు రూ. 29,880
22 క్యారెట్లు రూ. 27,980
వెండి(కిలో) రూ. 38,815

**కొబ్బరి** (పాలకొల్లు)
(వెయ్యింటికి)
పాతకాయ రూ. 11,000
కొత్తకాయ రూ. 9,600

రిపోర్టర్ల ఫోన్ నంబర్లు : ఆచంట - జేఎం మోహన్, 97053 46806, పెనుగొండ - జి. శ్రీనివాసరావు, 97054 01918, పెనుమంట్ర - ఎస్. జయ రామకృష్ణ, 99081 63555, పోడూరు - బి.చిట్టిబాబు, 73309 35849



# వెలవెలబోయిన జన్మభూమి సభలు

- గ్రామాల్లో స్పందన కరువు
- తొలి రోజు మొక్కుబడిగా కార్యక్రమాలు



కందరవల్లి గ్రామంలో జనాలు లేని జన్మభూమి సభ

**ఆచంట:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఐదో విడత జన్మభూమి సభలు మొదటి రోజు వెలవెలబోయాయి. కార్యక్రమాల నిర్వహణ నిమిత్తం ఆయా పంచాయతీ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన టెంట్లు, కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో అధికారులు, నేతలు తలలుపట్టుకుంటున్నారు. రాష్ట్ర మంత్రి పితాని సత్యనారాయణ మొదటి రోజు ఆచంట నియోజకవర్గంలో పెనుగొండ మండలం సిద్ధాంతం, దొంగరావిపాలెం, పెనుమంట్ర మండలం ఎస్. ఇలింద్రపర్రు, మల్లిపూడి గ్రామాల్లో జరిగిన సభల్లో పాల్గొన్నారు. ఆయా గ్రామాలు మినహా మిగిలిన గ్రామాల్లో సభలకు కనీస స్పందన కరువైంది. మంత్రి పితాని సైతం అభివృద్ధి కార్యక్రమాలను వివరించిన అనంతరం ప్రజల నుంచి చప్పట్లు అడిగి కొట్టించుకోవాల్సిన పరిస్థితి ఎదురైంది. సభలు కూడా పింఛన్లు, రేషన్ కార్డులు, చంద్రన్న బీమా చెక్కుల పంపిణీ వంటి కార్యక్రమాలకే పరిమితమయ్యాయి. పలు గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమాలు జరుగుతున్నాయన్న సమాచారం ఆయా గ్రామాల ప్రజలకు తెలియలేదు. పింఛన్లు తీసుకోవడానికి పంచాయతీకి వచ్చిన వృద్ధులు, దివ్యాంగులు, స్కూలు విద్యార్థులను జన్మభూమి సభల్లో బలవతంగా కూర్చోబెట్టారు. ఇప్పటి వరకూ ప్రభుత్వం నిర్వహించిన నాలుగు విడతల జన్మభూమి కార్యక్రమాల్లో ప్రజల నుంచి పెద్ద ఎత్తున వినతులు అందాయి. వీటిలో రేషన్ కార్డులు, పింఛన్ల మంజూరు తప్ప పెద్దగా సమస్యలకు మోక్షం లభించకపోవడంతో ప్రజల్లో ఆసక్తి కొరవడింది. పరిస్థితి ఇలా ఉంటే ఈనెల 11 వరకూ రోజూ సభలు ఎలా నిర్వహించాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. తొలిరోజు సభలు మొక్కుబడిగా కానిచ్చేసిన అధికారులు బుధవారం నుంచి గ్రామాల్లో మరింత ప్రచారం చేయాలని భావిస్తున్నట్లు సమాచారం.

## ఆకట్టుకున్న కళాజాత



బుర్రకథ చెబుతున్న కళాకారులు

**పెనుగొండ:** బడి పిలుస్తోంది, ఆత్మగౌరవ దీక్ష వంటి ప్రభుత్వ పథకాలపై నిర్వహించిన కళాజాత ప్రదర్శన ఆకట్టుకుంది. సిద్ధాంతం, రామన్నపాలెం, దొంగరావిపాలెం, ఇలపర్రుల్లో ఏలూరుకు చెందిన పార్వతి బుర్రకథ బృందం ప్రజలను ఆకట్టుకునే రీతిలో ప్రదర్శన ఇచ్చారు. పురాణ ఇతివృత్తాలను మేళవిస్తూ ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి జన్మభూమి వేదిక

**ఇల్లింద్రపర్రు, (పెనుమంట్ర):** గ్రామాల్లో ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి జన్మభూమి సభలు వేదికగా ఉపకరిస్తున్నాయని కార్మిక ఉపాధి కల్పనశాఖ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. పెనుమంట్ర మండలం ఇల్లింద్రపర్రు. మల్లిపూడి, జుత్తిగ గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన మాఊరు– జన్మభూమి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నత్తారామేశ్వరం–తణుకు ఆర్అండ్ బీ రహదారికి త్వరలోనే మోక్షం కలుగుతుందని మంత్రి అన్నారు. అర్హత ఉండి కూడా ప్రభుత్వ పథకాలు అందకపోతే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే విధంగా అధికారులు ప్రవర్తించకూదని సూచించారు. ఏఎంసీ చైర్మన్ సానబోయిన గోపాలకృష్ణ మాట్లాడుతూ ఇంటి స్థలాల సమస్య పరిష్కారానికి మంత్రి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నారన్నారు. సర్పంచులు గంటా శ్రీనివాసరావు, సానబోయిన సూర్యకాంతం, వీరవల్లి నాగలక్ష్మి స్థానిక సమస్యలను మంత్రికి వివరించారు. ఎంపీపీ కె.సరోజిని, జెడ్పీటీసీ సభ్యుడు సత్తి ఆదినారాయణరెడ్డి, మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు తమనంపూడి శ్రీనివాసరెడ్డి, చింతపల్లి సత్యనారాయణ, పార్టీ జిల్లా నాయకులు కర్రి జగదీష్‌రెడ్డి, కడలి ఏడుకొండలు, డీసీ చైర్మన్‌లు వెలగల బులిరామిరెడ్డి, గంధం వెంకట్రాజు, కర్రి సుబ్బారెడ్డి, కర్రి అచ్యుతరామారెడ్డి పాల్గొన్నారు.

# ఏటిగట్టు బలహీనపడుతోంది

దొంగరావిపాలెం గ్రామస్తుల ఆందోళన



దొంగరావిపాలెం జన్మభూమి సభలో మాట్లాడుతున్న మంత్రి పితాని

**పెనుగొండ:** ఏటిగట్టుపై ఇసుక లారీల రాకపోకలకు అనుమతించడంతో దొంగరావిపాలెం ఏటిగట్టు బలహీన పడుతోందంటూ జన్మభూమి కార్యక్రమంలో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. జన్మభూమి సభల్లో ప్రజలు సమస్యల ఏకరువు పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జన్మభూమి కార్యక్రమం పెనుగొండ మండలం దొంగరావిపాలెం, సిద్ధాంతం, రామన్నపాలెంలో మంగళవారం రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి పితాని సత్యనారాయణ ప్రారంభించారు. ఖండవల్లి ఇసుక ర్యాంపులో ఇసుక లారీలు నిత్యం ఖండవల్లి, మల్లేశ్వరం, దొంగరావిపాలెం ఏటిగట్టు మీదుగా జాతీయ రహదారికి చేరుకుంటున్నాయని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అసలే అంతంత మాత్రంగా ఉన్న ఏటిగట్టు మరింత బలహీన పడి వరదల సమయంలో గండి పడే అవకాశాలు ఉన్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. దొంగరావిపాలెం బాపినీడు కాలనీలో తాగునీటి సమస్యపై ప్రతీ జన్మభూమిలో మొరపెట్టుకుంటున్నా ఫలితం కనిపించడం లేదని స్థానిక ప్రజా ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ల స్థలాలు, రహదారులు, డ్రెయినేజీ, శ్మశాన వాటిక సమస్యలను ప్రస్తావించారు.

### లారీల రాకపోకలను నిలుపుదల చేస్తా

ఏటిగట్టు పటిష్టతపై గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఉన్నతాధికారులతో చర్చించి లారీల రాకపోకలను నిలిపివేయిస్తానని మంత్రి పితాని హామీ ఇచ్చారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నామన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడానికే జన్మభూమి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పెనుగొండ, ఆచంట ఏఎంసీ చైర్మన్లు సానబోయిన గోపాలకృష్ణ, ఉప్పలపాటి సురేష్ బాబు, వైస్ చైర్మన్ బడేటి బ్రహ్మాజీ, ఎంపీపీ పల్లి జూలీ సురేఖ, జెడ్పీటీసీ రొంగల రవికుమార్, సర్పంచ్‌లు పమ్మి మురళీ వెంకటేశ్వరరావు, బిరుదగంటి రత్నరాజు, కంకిపాటి పురుషోత్తం, వెలిచేటి బాబూరాజేంద్ర ప్రసాద్, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ కేతా సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## మరుగుదొడ్లు నిర్మించుకోవాలి



గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ ఆశాజ్యోతి

**పెనుగొండ:** ఆరోగ్యభారత్ నిర్మాణం కోసం ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని పెనుగొండ సర్పంచ్ యాదాల ఆశాజ్యోతి అన్నారు. మంగళవారం పెనుగొండ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన గ్రామసభకు అధ్యక్షత వహించారు. బహిరంగ మలవిసర్జన వల్ల ఎన్నో అనర్థాలు ఉన్నాయన్నారు. పారిశుధ్యం లోపించి వ్యాధులు వ్యాపిస్తాయని చెప్పారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడానికి ప్రభుత్వం మరుగుదొడ్ల నిర్మాణానికి కంకణం కట్టుకుందని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ వీటిని నిర్మించుకోవాలని కోరారు. గ్రామసభలో పలు తీర్మానాలు ఆమోదించారు. గ్రామ కార్యదర్శి జీవీవీ సత్యనారాయణ, పలువురు పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

## నాగరత్నం నేత్రదానం



**మార్టేరు, (పెనుమంట్ర):** ఇటీవల చనిపోయిన ఒక వృద్ధురాలు తన మరణానంతరం నేత్రాలను దానం చేసి అందిరి మన్ననలు పొందారు. మార్టేరు గ్రామానికి చెందిన నార్కెడమిల్లి నాగరత్నం (90) అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆమె ముందస్తు అంగీకారం, కుటుంబ సభ్యుల కోరిక మేరకు ఆమె నేత్రాలను దానం చేశారు. ఆమెకు ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. ఈ తతసందర్భంగా నాగరత్నం సేవా నిరతిని పలువురు కొనియాడారు.



## ఆర్టీసీ బస్సులు నడపాలి

**ఆచంట:** మండలంలోని పెదమల్లం, కోడేరు గ్రామాలకు తగినన్ని ఆర్టీసీ సర్వీసులు నడపాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు కొండేటి వీరాస్వామి, పెచ్చెట్టి సత్యనారాయణ ఒక ప్రకటనలో అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆయా గ్రామాలకు ఒకే ఒక్క ఆర్టీసీ బస్సు నడుస్తుండడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. ఆచంట వరకూ సర్వీసులు నడుపుతున్న అధికారులు కోడేరు, పెదమల్లం గ్రామాలకు ఒక్క సర్వీసుతోనే సరిపెడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి పెదమల్లం, కోడేరు గ్రామాలకు తగినన్ని బస్సులు నడపాలని కోరారు. ఇదే విధంగా రద్దు చేసిన పెదమల్లం–భీమవరం, ఏలూరు–కోడేరు సర్వీసులు పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.

# సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

## WANTED LANDS

■స్థలములు కావలెను. Wanted Lands సంప్ర॥ 7060155247, 8449459755 [G-607]

Services

## SALES & SERVICE

■Lohitha Technologies మా వద్ద సిసి కెమేరాలు అమర్చబడును. బయోమెట్రిక్, లాప్ టాప్స్, కంప్యూటర్స్ మావద్ద లభించును. అన్ని రకముల కంపెనీలు సేల్స్ & సర్వీస్ చేయబడును. సంప్ర : 9014622999, 9052022666. [P-897321]

## బంగారం కొనబడును.

■బ్యాంకులు / సంస్థల నుండి తాకట్టు పెట్టిన మీ బంగారాన్ని మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. సంప్రదించండి. ✆ 91606 90477 [B-6127]

■బ్యాంకుల లోను ప్రైవేటు సంస్థలలోను తాకట్టు పెట్టిన బంగారాన్ని విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్ నో చార్జెస్. సంప్ర: 8790624566 [C-884000]

■బ్యాంకులు / సంస్థల నుండి తాకట్టు పెట్టిన మీ బంగారాన్ని మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. సంప్రదించండి. ✆ 93460 30358 [B-6124]

■Gold Netic బంగారం బ్యాంకులో, తాకట్టు సంస్థలలో ఉన్నది విడిపించి కొత్తబంగారం ధరకు కొనబడును.మరియు గిఫ్ట్‌కూపన్ ద్వారా బహుమతులు గలవు. ✆ 96427 96420, 96427 96421 [O-617701]

## బరువు తగ్గబడును.

■ రూ.3999కి 5 కేజీలు వరకు బరువు తగ్గించుకోండి రిజిస్ట్రేషన్ మీద 10000 విలువగల బ్యూటీ సర్వీసెస్ ఉచితంగా పొందండి గమనిక ఈ ఆఫర్ కేవలం కలర్స్ భీమవరంలో జనవరి 5 వరకు మాత్రమే వివరములకు. సంప్రదించండి : 9542222000. [P-1486

## WEIGHT LOSS

■5 వారాలలో డైట్ లేకుండా 8–10 KG ల బరువు, చేతులు, తొడలు, పొట్ట సైజు, మలబద్ధకం, గ్యాస్ట్రిక్ ప్రాబ్లం, మోకాళ్ళ నొప్పులు తగ్గుతాయి. ఫోన్: 7207923767. [HA-15094]

## AYURVEDIC

■దాంపత్య సమస్యా?వివిధ రకమైన మందులు వాడి ఫలితం లేక నిరాశ పడుతున్నారా! మా ఆ యుర్వేద మందులు వాడి చక్కని ఫలితాన్ని పొందగలరు. డయాబెటిక్ పేషెంట్స్‌కి ప్రత్యేకం. 7794009622. [H-684405]

■శృంగార సమస్య శీఘ్రస్కలనం పలుచని వీర్యం, నరాల బలహీనత, అంగం వంకర & స్తంభించకపోవడం, ఈ సమస్యల కోసం మా గులికలు, క్రీమ్ & ఆయిల్ లింగవర్ధక యంత్రం ద్వారా పరిష్కారం పొందండి. 7539880120 [W-688271]

## లీజుకు కావలెను

■Ten Tyres Rockbody 2014-17 Tippers-6, 6 Units 2016-17 Model-5 Tippers Earthwork కి, 200 మిషన్లు లీజుకి కావలెను. సెల్ : 96427 71999, 82971 39999. [R-154]

Wanted

■అంబికా జాబ్స్ I.T.I. (జాబ్స్/అప్రెంటీస్) డిప్లొమా, M.B.A ఫైనాన్స్, అక్కౌంట్స్, కంప్యూటర్ ఆపరేటర్స్ సెక్యూరిటీ గార్డ్స్, హెల్పర్స్, మొ॥ జాబ్స్‌కు సంప్ర : 08812-244419, 9052270352. [P926180]

■భీమవరం పరిసరప్రాంతంలో పనిచేయుటకు సెక్యూరిటీ ఆఫీసర్ Ex Service సెక్యూరిటీ సూపర్ వైజర్, గార్డ్, కావలెను. 8.00 గం॥ డ్యూటి. సంప్ర : 966773932, 9515021829. [P-883373]

■7th - డిగ్రీ పాస్/ఫెయిల్ అయి ఖాళీగా వున్న 39 మంది స్త్రీ/పు కావలెను. జీ॥ 10 వేలు + DA 4200 + రూం ఫ్రీ, 29 సం॥లోపు వారు సంప్ర: సింధూ ప్రమోషన్స్, బుద్ధా పార్క్ దగ్గర, ఏలూరు . 97001 86006. [L-700549]

■నిడదవోలులోని మానసిక వికలాంగుల పాఠశాలలో పనిచేయుటకు వార్డెన్స్ (స్త్రీలు) టీచర్స్, ఆయాలు అడ్మినిస్ట్రేటర్ కావలెను. సంప్ర : 94933 08199, 6281704979. [P- 5348]

■Wanted Audit Staff to work in CA office Bhimavaram, B.Com with Computer Knowledge. Ph : 9963711123. 9959222150 email : raoandsharma@gmail.com [P-883363]

■ మీ ఇంటి వద్దనే ఉంటూ చేతి వ్రాత ద్వారా ప్రతివారం అధిక ఆదాయం, (అందరూ అర్హులే) సంప్రదించండి: మధు సాయి సర్వీసెస్. 7097286317, 7097286312. [H-695926]

■రాజధానిలో 200అ॥ సీడ్ యాక్సెస్ రోడ్‌ను ఆనుకొని పెద మద్దూరు నందు CRDA అప్రూవల్‌తో అతి తక్కువ ధరలో సులభ వాయిదాలలో ప్లాట్లుమార్కెటింగ్‌సిబ్బందికావలెను9397600348 [G-633]

■ప్రయివేట్ బ్యాంకులలో మరియు ప్రముఖ ఆర్థిక సంస్థలో, ఫైనాన్స్ సెక్టార్‌లో ఉద్యోగ అవకాశములు కలవు. వయస్సు : 18–35 సం॥లు. అర్హత : ఇంటర్ to పి.జి. సెల్ : 91541 47858 [R-143]

■జాబ్ గ్యారెంటి మీ జిల్లాలో నూతనంగా ప్రారంభించిన కం॥లో సూపర్‌వైజర్లు, టీంలీడర్స్, ప్యాకింగ్ బాయ్స్, హెల్పర్లు కావలెను. జీ॥10,000 పైన OT+బోనస్ 2వేలు రూం+మీల్స్ ఫ్రీ సం॥ 9703417043, 8367642170 [C-699306]

■గన్నవరం, రేణిగుంట, విశాఖపట్నం, రాజమండ్రి, HYDలో పనిచేయుటకు లోడింగ్ సూ॥వైజర్స్-64, హౌస్‌కీపింగ్ సూ॥వైజర్స్-52, ట్రాలి సూ॥వైజర్స్-48, లోడర్స్ స్త్రీ/పు కావలెను. ఆకర్షణీయమైన జీతం. Age:18-35, Q: 7th- డిగ్రీ రూం+మీల్స్ ఫ్రీ. 95423 73962, 95423 27384 [G-551]




## గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సింది గా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.




పాడి-పంట

# దోసకు తెగుళ్ల గోస

పెరవలి :

దోస సాగును తెగుళ్ల బెడద వేధిస్తోంది. జిల్లాలో ఏజెన్సీతోపాటు గోదావరి తీర లంక భూముల్లో దోస సాగు జరుగుతోంది. ఈ పంటకు వేడి వాతావరణం అనుకూలం. ప్రస్తుతం మంచు ప్రభావం వల్ల తెగుళ్ల ఆశిస్తున్నాయి. పెంకు పురుగులు, బూజు, పక్షి కన్ను, వెర్రి, బూడిద తెగుళ్ల రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. వీటి నివారణ చర్యలను తణుకు వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎం.పార్థసారథి వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..



కానూరు అగ్రహారంలో తెగుళ్లు సోకి పాడైపోతున్న దోసపాదులు, (అంతరచిత్రం) ఎం.పార్థసారథి ఏడీఏ, తణుకు

**● పెంకు పురుగులు :**
ఇవి పంట పెరుగుదలను అడ్డుకుంటాయి. ఆకులను, పూలను తినేస్తాయి. వీటి నివారణకు కార్బరిల్ 50శాతం పొడిని 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

**● బూజు తెగులు :**
చల్లటి వాతావరణంలో ఈ తెగులు విజృంభిస్తుంది. మొదటిలో లేత ఆకుపచ్చ, ముదురు ఆకుపచ్చ మచ్చలు వచ్చి మొజాయిక్ తెగులు వలే కన్పిస్తుంది. ఆకుల పైభాగాన పసుపు రంగు మచ్చలు, అడుగు భాగాన ఊదా రంగు మచ్చలతో బూజు ఏర్పడుతుంది. ఆకులు పండుబారి ఎండిపోతాయి. దీని నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రాములు లేదా మెటలాక్సిల్ ఎమ్ జెడ్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

**● వెర్రి తెగులు :**
ఆకుల ఈనెల మధ్య మందంగా చారలు ఏర్పడి పెలుసుగా మారి ఆకులు గిడసబారిపోతాయి. దీని ప్రభావం వల్ల పూత, పిందె ఆగిపోతుంది. ఈ తెగులు అధికంగా సోకిన మొక్కలను పీకి నాశనం చేయాలి. లేకుంటే గాలి ద్వారా మిగిలిన పాదులకు తెగులు పాకుతుంది. ఈ తెగులును వ్యాప్తిచేసే పేనుబంక పురుగులను నివారించడానికి డైమిథోయేట్ లేదా మిథైల్ డెమటాన్ 2 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**● పక్షి కన్ను తెగులు (ఆంత్రాక్నోస్) :**
ఆకులపై, కాయలపై గుండ్రని చిన్న చిన్న మచ్చలు ఏర్పడి ఆకులు ఎండిపోయి రాలిపోతాయి. పిందె దశలో ఈ తెగులు ఆశిస్తే కాయలు రాలిపోతాయి. గుర్తించిన వెంటనే నివారణ చర్యలు చేపట్టాలి. కాపర్‌ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా కార్బండజిమ్ ఒక గ్రాము లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేస్తే నివారించవచ్చు.

**● బూడిద తెగులు :**
ఆకుల పైభాగాన ముందుగా తెలుపు తరువాత బూడిద రంగులో చిన్నచిన్న మచ్చలు వచ్చి తరువాత తెల్లని పొడి వంటి పదార్థం ఏర్పడుతుంది. తెగులు ఉధృతంగా ఉంటే ఆకులు పండుబారి ఎండిపోతాయి. ఈ తెగులు లేత ఆకులకన్నా ముదురు ఆకులనే ఎక్కువగా ఆశిస్తుంది. దీని నివారణకు ట్రైడీమార్ఫ్ 1 మిల్లీలీటరు లేదా డైనోకాఫ్ 1 మిల్లీలీటరు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

# మద్ది ఆలయానికి రూ.లక్ష విరాళం

జంగారెడ్డిగూడెం రూరల్ :

గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదానానికి ఓ భక్తుడు రూ.లక్ష విరాళాన్ని మంగళవారం అందజేశారు. ద్వారకాతిరుమల మండలం తిరుమలంపాలెం పంచాయతీ పావులూరిగూడెంకు చెందిన పాలకుర్తి మురళీకృష్ణ తన తల్లిదండ్రులు శ్రీరాములు, వెంకట రత్నమ్మల జ్ఞాపకార్థం ఈ విరాళాన్ని ఇచ్చారు.

**అంజన్నకు ప్రత్యేక పూజలు :** ఆలయంలో ఆంజనేయస్వామికి మంగళవారం ఆలయ ప్రధానార్చకులు వేదాంతం వెంకటాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. 108 ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం ఒక్కరోజు ఆదాయం రూ. 2,57,804 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. 800 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.



మద్ది క్షేత్రానికి రూ.లక్ష విరాళాన్ని అందజేస్తున్న దాత మురళీకృష్ణ

# జన్మభూమి సభల్లో నిలదీద్దాం

## మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు పుష్పరాజ్

ఆచంట : అధికారపార్టీ నిర్వహిస్తున్న జన్మభూమి కార్యక్రమాల వల్ల ప్రజలకు ఒరిగేదేమీలేదని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ విమర్శించారు. మంగళవారం ఆచంట చినపేటలో జరిగిన మాలమహానాడు కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రచారం కోసం రూ.వందలకోట్లు దుర్వినియోగం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ప్రభుత్వం వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. గత జన్మభూమిలో వచ్చిన ఫిర్యాదులకు ఎటువంటి పరిష్కారం చూపకుండా ప్రస్తుతం మళ్లీ జన్మభూమి పేరుతో ప్రజల ముందుకు ఏ ముఖం పెట్టుకుని ప్రభుత్వం వెళుతుందని పుష్పరాజ్ ప్రశ్నించారు. జన్మభూమి సభలలో ప్రభుత్వాన్ని నిలదీద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు. రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్లస్థలాలు, ఇళ్లు వంటి సమస్యలు తీర్చలేకపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని పుష్పరాజ్ హెచ్చరించారు.

# భవిత ప్రశ్నార్థకం

- ప్రత్యేక అవసరాల బాలలపై శ్రద్ధ కరువు
- కేంద్రాల్లో సగం మందికి అందని భోజనం
- రెండు నెలల నుంచి రవాణా, ఎస్కాట్ చార్జీలు లేవు
- వేధిస్తున్న సిబ్బంది కొరత




కొవ్వూరులో భవిత కేంద్రం





భవిత కేంద్రంలో శిక్షణ ఇస్తున్న దృశ్యాలు

**కొవ్వూరు:** బుద్ధిమాంద్యం, అంధత్వం, వినికిడి లోపం, మానసిక పరిపక్వత లేమి, మెదడు సంబంధిత సమస్యలు ఉన్న ప్రత్యేక అవసరాలు గల బాలలలో మార్పు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం భవిత కేంద్రాలను నెలకొల్పింది. ఇక్కడ పిల్లల్లో ఆలోచనా శక్తి, మానసిక వికాసం పెంపొందించేందుకు సర్వశిక్షా అభియాన్ ద్వారా ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. అయితే ఉన్నత లక్ష్యంతో నెలకొల్పిన కేంద్రాలు నిర్లక్ష్యం, నిరాదరణకు గురవుతున్నాయి. 18 ఏళ్లలోపు పిల్లలను ఇక్కడ చేర్చుకుంటారు.

**50 కేంద్రాలు..**
**1,400 మంది బాలలు**

జిల్లావ్యాప్తంగా 16 భవిత కేంద్రాలు, 34 నాన్ భవిత కేంద్రాలు ఉన్నాయి. వీటిలో సుమారు 1,400 మంది విద్యార్థులు న్నారు. వీరిలో సగం మంది పిల్లలకు మధ్యాహ్న భోజనం అందడం లేదు. కేంద్రాలకు సమీపంలో ఉన్న పాఠశాలల్లో విద్యార్థుల పేర్లు నమోదు చేయించారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో భాగంగా విద్యార్థుల వివరాలను ఎండీఎం (మిడ్‌డే మీల్స్) యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. అయితే వివరాలు యాప్‌లో నమోదు కాకపోవడంతో మధ్యాహ్న భోజనం అందడం లేదు. దీంతో ఇళ్ల నుంచి భోజనాలు తెచ్చుకోవాల్సి వస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు.

**60 శాతం కేంద్రం..**
**40 శాతం రాష్ట్ర నిధులు**

ఏటా భవిత కేంద్రాల నిర్వహణకు ప్రభుత్వం రూ.కోటి బడ్జెట్ కేటాయిస్తోంది. దీనిలో సుమారు రూ.80 లక్షల ఖర్చువుతుంది. సర్వశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ద్వారా నడిచే వీటి నిర్వహణకు అయ్యే వ్యయాన్ని 60 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్రం భరిస్తున్నాయి. 1 నుంచి 8వ తరగతి వరకు ఎస్ఎస్ఏ ద్వారా, 9,10 తరగతులకు రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (ఆర్ఎంఎస్ఏ) ద్వారా నడుపుతున్నారు. ఉదాహరణకు కొవ్వూరు భవిత కేంద్రంలో 25 మంది విద్యార్థులు ఉన్నారు. స్థానిక ముస్లిం స్కూల్ ప్రాంగణంలో ఉన్న ఈ కేంద్రంలో 13 మంది పిల్లల పేర్లు మాత్రమే పాఠశాల రికార్డుల్లో నమోదయ్యాయి. మిగిలిన వారి పేర్లు ఎండీఎస్ యాప్‌లో నమోదు కాకపోవడంతో వీరికి భోజనం అందని పరిస్థితి. జిల్లావ్యాప్తంగా అన్ని భవిత, నాన్ భవిత కేంద్రాల్లోనూ ఇలాంటి పరిస్థితే ఉంది.

**అందరినీ ఎన్‌రోల్ చేయిస్తాం**

భవిత కేంద్రాల్లో ఉన్న పిల్లలందరినీ సమీపంలోని పాఠశాలల్లో ఎన్‌రోల్ చేయాలని ఆదేశించాం. కొంత మంది విద్యార్థులు ఎన్‌రోల్ కాకపోవడంతో మధ్యాహ్న భోజనానికి ఇబ్బంది వచ్చిన విషయం వాస్తవమే. ఎండీఎం యాప్‌లో అందరి పేర్లు ఎన్‌రోల్ కాకపోవడంతోనే సమస్య ఉంది. రెండు నెలలు నుంచి రవాణా, ఎస్కాట్ చార్జీలు చెల్లించాల్సి ఉంది. నిధులు అందగానే చెల్లింపులకు చర్యలు తీసుకుంటాం. సైకాలజిస్టులు, స్పీచ్‌థెరపిస్టులు దొరక్కపోవడంతో అవసరమైన మేరకు ఏర్పాటు చేయలేకపోతున్నాం. ఉన్నవాళ్లతో కేంద్రాల్లో సర్దుబాటు చేస్తున్నాం.

– ఎస్‌కే మీర్జా ఆలీ,
సహిత విద్య, జిల్లా కో–ఆర్డినేటర్

**రెండు నెలలుగా అందని చార్జీలు**

భవిత కేంద్రాలకు బాలలను తీసుకువచ్చేందుకు సహాయకులకు (ఎస్కాట్) నెలకు రూ.250, రవాణా చార్జీల కింద రూ.300 చొప్పున చెల్లిస్తున్నారు. గతేడాది అక్టోబర్ వరకు వీరికి ఈ సొమ్ములు చెల్లించారు. నవంబర్, డిసెంబర్ నెలల బకాయిలు ఉన్నాయి. 751 మంది సహాయకులు (ఎస్కాట్) సాయంతో వచ్చేవాళ్లు, 931 మంది ఇతర ప్రాంతాల నుంచి భవిత కేంద్రాలకు వస్తున్నారు. వీరందరికీ రెండు నెలలకు కలిపి రూ.9.34 లక్షలు చెల్లించాల్సి ఉంది.

## అరకొర సిబ్బంది.. సేవలు పరిమితం

ప్రభుత్వం భవిత కేంద్రాల్లో ఎన్నో సదుపాయాలు, సామగ్రి సమకూర్చింది. దీంతో పాటు దాతలూ సహాయ సహకారాలు అందిస్తున్నారు. కొవ్వూరు నియోజకవర్గంలో భవిత కేంద్రం నిర్వహణకు దాతలు రూ.4 లక్షలు ఆర్థిక సాయం చేశారు. జిల్లాలోని 50 కేంద్రాల్లో కేంద్రానికి ఇద్దరు సహిత విద్య బోధకులు చొప్పున 100 మందికి గాను 90 మంది మాత్రమే ఉన్నారు. మూడు మండలాలకు ఒక ఫిజియోథెరపిస్టు, సైకాలజిస్టు, స్పీచ్ థెరపిస్ట్ చొప్పున నియమించే అవకాశం ఉన్నా 17 మంది ఫిజియోథెరపిస్టులు, ఇద్దరు సైకాలజిస్టులు, ఒకే ఒక్క స్పీచ్ థెరపిస్ట్ మాత్రమే ఉన్నారు. దీంతో ప్రత్యేక అవసరాల పిల్లలకు స్పీచ్ థెరపీలో శిక్షణ ఇచ్చే అవకాశం ఉండటం లేదు. జిల్లావ్యాప్తంగా నెలకు ఒకరోజు మాత్రమే స్పీచ్‌థెరపిస్ట్ వెళ్లే అవకాశం ఉంది. ఆయన సెలవు పెడితే ఒక్కసారి రావడం కూడా గగనమే.

## పర్యవేక్షణ శూన్యం

జిల్లాలో భవిత కేంద్రాలపై అధికారుల పర్యవేక్షణ లోపించినట్టు కనిపిస్తోంది. వారంలో ఐదు రోజులు మాత్రమే కేంద్రాలు నడుపుతున్నారు. శనివారం క్షేత్రస్థాయి పర్యటన పేరుతో సిబ్బంది సొంత పనులు చూసుకుంటున్నారన్న విమర్శలున్నాయి. కొన్ని కేంద్రాల్లో బాలల హాజరు శాతం తక్కువగా ఉంది. కేంద్రానికి వచ్చిన వాళ్లు సైతం కొద్దిసేపటికే తిరిగి వెళ్లిపోవడంతో వెలవెలబోతున్నాయి. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పనివేళలుగా నిర్ణయించినా నిర్దేశిత సమయం వరకూ ఎక్కడ నిర్వహించడం లేదన్న విమర్శలున్నాయి. జిల్లావ్యాప్తంగా భవిత కేంద్రాల పర్యవేక్షణకు ఒక కో–ఆర్డినేటర్, సహాయ కో–ఆర్డినేటర్ ఉంటారు. మండలస్థాయిలో విద్యాశాఖాధికారులకు కేంద్రాల పర్యవేక్షణ అప్పగించినా వీరు పెద్దగా శ్రద్ధ చూపడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

# మా కుమార్తెది ముమ్మాటికీ హత్యే

- పోలీసులకు ఫిర్యాదు చేసిన మృతురాలి తండ్రి
- కట్నం వేధింపులే కారణం

**చింతలపూడి:** తన కుమార్తెది ముమ్మాటికీ హత్యేనని మృతురాలి తండ్రి కణపోత చందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం బొర్రంపాలెం సిండికేట్ బ్యాంక్‌లో పనిచేస్తున్న ఫీల్డ్ ఆఫీసర్ కైలాష్ భార్య పల్లవి వర్ష చింతలపూడిలోని స్వగృహంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. మంగళవారం జంగారెడ్డిగూడెం డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కట్నం వేధింపుల కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు డీఎస్పీ చెప్పారు.

**అదనపు కట్నం కోసం వేధించారు**

మృతురాలి తండ్రి చందర్ తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణలోని కామారెడ్డి జిల్లా గాంధారీ మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన వర్షను జిల్లాలోని టి.నరసాపురం మండలం బొర్రంపాలెం సిండికేట్ బ్యాంక్‌లో ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న వరుసకు బంధువైన బానోతు కైలాష్‌కు ఇచ్చి గతేడాది మే నెలలో వివాహం జరిపించారు. ఆ సమయంలో రూ.11 లక్షల కట్నం, లాంఛనాలు ఇచ్చారు. కొద్దిరోజుల తర్వాత కైలాష్ మద్యానికి బానిసై భార్య వర్షను అదనపు కట్నం కోసం వేధించేవాడు. ఈ విషయాన్ని వర్ష తల్లిదండ్రులకు పలుమార్లు ఫోన్‌లో చెప్పింది. ఇటీవల చింతలపూడి వచ్చి టీవీ, ఇతర గృహోపకరణాలు కొని ఇచ్చి వెళ్లానని, అదనపు కట్నం కోసమే అల్లుడు కైలాష్, అత్త లలిత తన కుమార్తెను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని తండ్రి చందర్ రోదిస్తూ చెప్పాడు. కుటుంబసభ్యులు మార్చురీలో ఉన్న వర్ష మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. పోలీసులు మృతదేహానికి పంచనామా చేసి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.



చింతలపూడి మార్చురీ వద్ద విలపిస్తున్న వర్ష కుటుంబ సభ్యులు

## పేరుపాలెం బీచ్‌లో విద్యార్థి గల్లంతు

**మొగల్తూరు:** మొగల్తూరు మండలంలోని పేరుపాలెం బీచ్‌లో విద్యార్థి గల్లంతయ్యాడు. మంగళవారం రాత్రి వరకూ విద్యార్థి ఆచూకీ తెలియరాలేదు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యలమంచిలి మండలం కలువపూడిలోని జోగయ్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌కు చెందిన 21 మంది విద్యార్థులు సోమవారం సాయంత్రం పేరుపాలెం బీచ్‌కు వచ్చారు. సముద్ర స్నానాలకు దిగిన వారిలో తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం కోటి గ్రామానికి చెందిన తిరుగుపల్లి మెహిపాల్ అంబేడ్కర్ (17) అనే విద్యార్థి కనిపించలేదు. విద్యార్థి దుస్తులు, సెల్‌ఫోన్, పాదరక్షలు ఒడ్డునే ఉండటంతో అలల తాకిడికి గల్లంతయ్యాడని భావించి గాలింపు చేపట్టారు. రాత్రి వరకూ ఆచూకీ తెలియలేదు. సమాచారం మేరకు హాస్టల్ నిర్వాహకుడు మహింబాజీ ఇక్కడకు చేరుకుని అర్ధరాత్రి సమయంలో మొగల్తూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కె.గురయ్య తెలిపారు.

## బీఎస్ఎన్ఎల్ ఉచిత కాలింగ్ సమయాలు మార్పు

**ఏలూరు (వన్‌టౌన్):** బీఎస్ఎన్ఎల్ ల్యాండ్‌లైన్, బ్రాడ్‌బ్యాండ్, కాంబో, ఎఫ్‌టీటీహెచ్ సేవలకు ఉచిత నైట్ ఫ్రీ కాలింగ్ సమయాలు సవరించినట్టు బీఎస్ఎన్ఎల్ జిల్లా జనరల్ మేనేజర్ కేఎస్ వరప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జనవరి 1 నుంచి రాత్రి 10.30 గంటల నుంచి ఉదయం 6.00 గంటల వరకు, ఆదివారాల్లో రోజంతా దేశవ్యాప్తంగా అన్ని నెట్‌వర్కులకు అపరిమిత ఉచిత కాలింగ్ పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు కస్టమర్ సర్వీస్ సెంటర్‌లో సంప్రదించాలని కోరారు.

## సీతా పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

**భీమవరం:** రాష్ట్రస్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ కళాశాలల స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో భీమవరం బి.సీతాపాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు బ్యాడ్మింటన్ విభాగంలో బహుమతులు గెల్చుకున్నారని ప్రిన్సిపల్ డీవీ సుబ్బారావు మంగళవారం తెలిపారు. గతనెల 28 నుంచి మూడు రోజులపాటు ఒంగోలు సేస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో బాలికల బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో డి.హర్షిణి ద్వితీయ, డబుల్స్‌లో డి.హర్షిణి, సీహెచ్ ఆకాంక్ష రెండో స్థానంలో నిలిచారన్నారు. విజేతలను కళాశాల చైర్మన్ కేవీ విష్ణురాజు, వైస్ చైర్మన్ రవిచంద్రన్ తదితరులు అభినందించారు.




Praja Sankalpa Yaatra

## అన్నను చూడాలని..


ఆయిల్ ట్యాంకర్‌పైకి ఎక్కిన అభిమానులు

## అభిమాన రథం


బస్సుపై నుంచి అభివాదం చేస్తూ..

## కొండంత సంతోషం


వాల్మీకిపురం సమీపంలో...

## గూడు కట్టిన ఆప్యాయత


జననేతను చూసేందుకు భవనంపైకి చేరుకున్న ప్రజలు


వెల్లివిరిసిన ఆనందం..


అవ్వకు ఓదార్పు..


భరోసానిస్తూ..

బ్రహ్మరథం.. వాల్మీకిపురంలో రాష్ట్ర ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అపూర్వ స్వాగతం పలుకుతున్న ప్రజలు, అభిమానులు



# అలుపెరు... అడుగ...

ఉద్యోగ భద్రత లేని ఉపాధ్యాయులు
వేతన అగచాట్లతో సంఘమిత్రలు
గిట్టుబాటు ధరలేని రైతులు
హంద్రీ–నీవా కోసం ఎదురు చూస్తున్న జనాలు
జననేతను కదిలించిన పడమట అంశాలు

అలుపెరుగని యాత్రలో..
50 రోజుల ప్రయాణంలో..
700 కిలోమీటర్లు దాటిన తరుణంలో..
జనం అడుగడుగునా నీరాజనాలు పలికారు.
ప్రజాసంకల్ప యాత్రికుడు జగన్‌మోహన్‌రెడ్డికి
మంగళవారం బ్రహ్మరథం పట్టారు.


పూలవాండ్లపల్లె శివారులో వినతులు అందుకుంటూ..


అన్నయ్యతో ఆత్మీయ సెల్ఫీ

సమస్య...

## ఉద్యోగ భద్రత కల్పించాలి

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలల్లో (ఏపీఆర్ఎస్) కాంట్రాక్టు రిసోర్స్ టీచర్స్ (సీఆర్‌టీ)గా పనిచేస్తున్న ఉపాధ్యాయుల్ని క్రమబద్ధీకరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వాల్మీకిపురానికి చెందిన అరుణకుమారి, సోఫియాబేగం తదితరులు ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మంగళవారం ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా వాల్మీకిపురం వద్ద వారు ఆయనను కలిసి సమస్యలు ఏకరువు పెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా సీఆర్‌టీలకు బేసిక్ వేతనాలు ఫిక్స్ చేసిన ఘనత అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డిదేనన్నారు. రాష్ట్రంలో ఉన్న 76 గురుకుల పాఠశాలల్లో 236 మంది సిబ్బంది 2001 నుంచి సీఆర్‌టీలుగా పనిచేస్తున్నారని, తమను రెగ్యులరైజ్ చేయడానికి ప్రభుత్వం చొరవ చూపడం లేదని వాపోయారు.– చిత్తూరు అర్బన్



## జననేతను చూడాలని..

వాల్మీకిపురంలో సురేష్‌కు చిన్న హోటలే జీవనాధారం. రెండు నెలల క్రితం మధుమేహ వ్యాధి ఎక్కువ కావడంతో చికిత్స కోసం కుటుంబ సభ్యులు అతన్ని బెంగళూరులోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో అతని కుడికాలును వైద్యులు తొలగించారు. అక్కడే చికిత్స పొందుతున్న సురేష్‌కు మంగళవారం తమ ఊర్లోకి జననేత వస్తున్నారని తెలిసింది. ఒక్కసారైనా తమ అభిమాన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డిని చూడాలని నిశ్చయించుకున్నాడు. కుటుంబ సభ్యులపై ఒత్తిడి పెంచి సోమవారమే ఇంటికి చేరుకున్నాడు. జగనన్నను కలిసి తన ముచ్చట తీర్చుకున్నాడు. ఇది తన జీవితంలో చిరకాలం గుర్తుండిపోతుందని సంతోషం వ్యక్తం చేశాడు.



## దేశయ్య ...

“నేను పుట్టు గుడ్డివాడిని. జ...
కునేందుకు ఎక్కడి నుంచో జగనన్న...
తెలుసుకున్నా. ఆయన్ను ఎట్టా చూ...
సామి గొంతు వింటే సాలనుకున్నా...
నాడు. నాతో మాట్లాడినాడు. నా బ...
ఇంతకన్నా ఏం కావాలి సామీ..” అ...
చెందిన దేశయ్య తన సంతోషాన్ని ...
తన పిన్ని ఈశ్వరమ్మతో కలిసి రోడ్...
నేత కోసం ఎదురు చూస్తున్నాడు.. ...
హన్ రెడ్డి తన దగ్గరకు వచ్చి హత్తు...
ఆనందానికి లోనయ్యారు.


...దంపప్పును స్వీకరిస్తూ..


ఊరికి పండగొచ్చింది.. వాల్మీకిపురంలో స్వాగత తోరణాలు


ధైర్యాన్నిస్తూ..




అన్నదాత నవ్వాలి..
కాశీరావు పేటలో జననేత వెంట నడుస్తున్న రైతన్న


...లు తెలుసుకుంటున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- **ఆనంద హేల**


వాల్మీకిపురం సమీపంలో అభిమానుల సందడి

- **మమతానురాగం**


జగనన్నను కలిసిన అక్కాచెల్లెమ్మలు


ఆత్మీయ స్పర్శ.. జననేతతో కరచాలనం చేస్తూ..


అన్నొస్తున్నాడని.. వాల్మీకిపురంలో స్వాగతం పలికేందుకు నిరీక్షణ

**కష్టాలు తెలుసుకుంటూ..**


వాల్మీకిపురంలో సమస్యలు విన్నవిస్తున్న సోదరి

**తీపి జ్ఞాపకం**


జననేతతో సెల్ఫీ తీసుకుంటున్న చెల్లెమ్మ

**అక్షర స్వాగతం**



అన్నయ్యకు పూల స్వాగతం

**ఆత్మీయ పలకరింపు**


కాశీరావుపేటలో అక్కాచెల్లెమ్మలను పలుకరిస్తూ..

**హద్దులు దాటిన అభిమానం**


జననేతతో కర్ణాటక రాష్ట్ర బస్సు కండక్టర్

## ...సంతోషం!

...నాల బాధల్ని తెలుసు ... వస్తా ఉండాడని ...డలేను. కనీసం ఆ ... కానీ అన్న నన్ను తాకి ...గోగులు అడిగినాడు. ...అంటూ వాల్మీకిపురానికి ...వ్యక్తంచేశారు. ఆయన ...్డు పక్కన నిలబడి జన... ప్రజాసంకల్పయాత్రలో భాగంగా అటువైపు వెళుతున్న జగన్‌మో...కుని యోగక్షేమాలు అడిగి తెలుసుకోవడంతో ఆయన పట్టరాని



## పరిహారం ఇవ్వలేదన్నా



"అన్నా.. మాకుండేదే 30 గుంటలు. పొలాల్లో రోడ్డు వేయాలి.. భూములు తీసుకుంటామని అధికారులు నోటీసులిచ్చారన్నా. భూమికి ఎంత పరిహారం ఇస్తారు.. ఎప్పుడిస్తారు..? అని కూడా చెప్పలేదు.." అంటూ మదనపల్లె రూరల్ మండలంలోని అండవారి పల్లెకు చెందిన సుజాత తదితరులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. పూలవాండ్లపల్లె సమీపంలో వారు జననేతను కలిశారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పంట పొలాలు తీసుకుంటున్నారని, దీనికి ప్రత్యామ్నాయంగా తమకు మరెక్కడైనా భూములతో పాటు పరిహారం కూడా ఇచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

## ఊరి చివరనే పూరిపాకలు



'సామీ మాది ఊరి బయట ఉన్న ఎస్సీ కాలనీ. పదిహేనేళ్లకు పైగా ఇక్కడే ఉన్నాం. రోడ్లు లేవు. నీళ్లు రావు. చాలా మందికి సొంతిళ్లు కూడా లేవు' అంటూ మదనపల్లె రూరల్‌కు చెందిన సుగుణ ఇతర మహిళలు ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించుకున్నారు. ప్రజాసంకల్పయాత్రలో భాగంగా తమ ఊరి చివర వేచి ఉన్న మహిళల్ని జగన్‌మోహన్ రెడ్డి ఆప్యాయంగా పలకరించారు. కొంత దూరం ఆయనతో కలసి నడిచిన మహిళలు గ్రామంలోని సమస్యల్ని వివరించారు. ఎస్సీ కాలనీల్లో మౌలిక వసతులు, సదుపాయాలు కల్పించాలన్నారు.

పశ్చిమగోదావరి | బుధవారం | జనవరి | 3 | 2018 సాక్షి

# టీడీపీలో రోజుకో తగాదా

- కలకలం రేపిన మంత్రి జవహర్ దాడి
- చింతలపూడిలో ఎంపీ చిచ్చు
- గూడెంలో బాపిరాజు హడావుడి
- పార్టీ అధిష్టానానికి తప్పని తలనొప్పి

**సాక్షి ప్రతినిధి, ఏలూరు :** పశ్చిమ గోదావరి జిల్లాలో తెలుగుదేశం పార్టీ నేతల వ్యవహారం అధిష్టానానికి తలనొప్పిగా మారింది. రోజూ ఏదో వ్యవహారంపై జిల్లా నుంచి ఫిర్యాదులు అందుతుండటంతో అధిష్టానం సీరియస్‌గా ఉంది. అయినా నాయకుల వైఖరిలో మార్పు కనపడటం లేదు. మంగళవారం ఏకంగా మూడు అంశాలపై ఇన్‌చార్జి మంత్రి పత్తిపాటి పుల్లారావుకు ఫిర్యాదులు వెళ్లడంతో, దీనిపై త్వరలో ఆయన జిల్లాకు వచ్చి వాటిని పరిష్కరించాలని సీఎం ఆదేశాలిచ్చినట్టు తెలిసింది.

**'బాబు' సీరియస్!**

కొవ్వూరులో ఏకంగా జిల్లా మంత్రే తన పార్టీకి చెందిన వారిపై దాడికి దిగడం పార్టీకి తలనొప్పిగా మారింది. ఈ అంశాన్ని చంద్రబాబునాయుడు సీరియస్‌గా తీసుకున్నట్టు సమాచారం. దీనిపై నిఘా వర్గాల నుంచి పూర్తి నివేదిక తెప్పించుకున్నట్టు తెలిసింది. ఇప్పటివరకూ సోషల్ మీడియాలో వచ్చిన వ్యాఖ్యలపై విపక్షాలపై గురిపెట్టి వారిపై కేసులు పెట్టడం ఆనవాయితీగా మారిన సంగతి తెలిసిందే. ఆఖరికి సొంత పార్టీ నేతలు వ్యాఖ్యలు చేసినా సహించే స్థితిలో లేకుండా పోతున్నారు. గతంలో బీర్ హెల్త్‌డ్రింక్ అంటూ మంత్రి ఇచ్చిన స్టేట్‌మెంట్‌పై వ్యాఖ్యలు చేసినందుకు కేసు పెట్టడమే కాకుండా ఇంటికి పిలిచి మంత్రి స్వయంగా దాడి చేయడం పార్టీలో కలకలం రేపింది.

**చింతలపూడిలో రాజుకున్న అగ్గి**

చింతలపూడిలో ఇటీవలే సద్దుమణిగిన అసమ్మతి వ్యవహారానికి మంగళవారం ఏలూరు ఎంపీ మాగంటిబాబు మరోసారి ఆజ్యం పోశారు. కనీసం నియోజకవర్గ ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వకుండా కామవరపుకోట, జంగారెడ్డిగూడెం మండలాల్లో రెండు గ్రామసభలకు తన వర్గం నేతలతో హాజరుకావడం చర్చనీయాంశమైంది. ఢిల్లీ వెళ్లే విమానం మిస్ అయినందున రెండు కార్యక్రమాలకు అనుకోకుండా వచ్చానని ఎంపీ చెబుతున్నప్పటికీ ఆ ప్రాంతాల్లో ఉన్న తన వర్గం నేతలకు ఫోన్ చేసిన ఎంపీ నియోజకవర్గ ఎమ్మెల్యే పీతల సుజాతకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఎంపీ వైఖరిని నిరసిస్తూ ఎంపీపీ మద్దిపోటి సుబ్బలక్ష్మి గైర్హాజరయ్యారు. ఇన్‌చార్జి మంత్రికి ఫిర్యాదు అందింది. అలాగే తాడేపల్లిగూడెంలో నియోజకవర్గ ఎమ్మెల్యే అయిన మంత్రి మాణిక్యాలరావుకు సమాచారం ఇవ్వకుండా రెండు గ్రామాల్లో జరిగిన సభలకు జెడ్పీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు హాజరుకావడం వివాదమైంది. ప్రభుత్వ కార్యక్రమం కావడంతో స్థానిక ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వాల్సి ఉంది. అయితే గూడెంలో రెండు పార్టీల మధ్య సఖ్యత లేకపోవడంతో సమాచారం ఇవ్వకుండానే జెడ్పీ చైర్మన్ ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# వృద్ధ ప్రయాస..

- పింఛన్ల ఆశచూపి 'జన్మభూమి'కి వృద్ధుల తరలింపు
- సభ ముగిసిన తర్వాత పింఛన్లు ఇవ్వడం లేదని ప్రకటన
- తీవ్ర ఆవేదనతో వెనుదిరిగిన వృద్ధులు, వికలాంగులు

గోరంతలు కొండంతలుగా చెప్పుకునేందుకు జన్మభూమి- మా ఊరు పేరిట ప్రభుత్వం చేస్తోన్న ప్రయత్నం వృథా ప్రయాసగా మారుతోంది. నాయకులు చెప్పే ప్రసంగం వినేందుకు ప్రజల్లో ఉత్సాహం కనిపించకపోవడంతో చేసేది లేక వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు నెలవారీ ఇచ్చే పింఛను ఇక్కడ ఇస్తామంటూ జన్మభూమి సభలకు తీసుకువస్తున్నారు. ఇలాగే మంగళవారం ఏలూరులోని 50వ డివిజన్‌లో ప్రారంభించిన జన్మభూమి సభకు అభాగ్యులను తీసుకువచ్చారు. పాపం... కూర్చొంటే లేవలేని వృద్ధులు, వికలాంగులు పింఛను ఇస్తారన్న ఆశతో సభకు వచ్చి కూర్చొన్నారు. ప్రజాప్రతినిధి వచ్చి తన ప్రసంగం ముగించుకుని వెళ్లిపోయాక తెలిసింది పింఛన్ ఇక్కడ ఇవ్వరని, ఎప్పుడు ఇచ్చే చోటే తెచ్చుకోండి అంటూ స్థానిక నాయకులు చెప్పడంతో వృద్ధులు తెల్లముఖం వేశారు. ఇప్పుడు పడిదంతా వృథా ప్రయాసేనా అనుకుంటూ ఊసురోమని ఎప్పుడు పింఛను ఇచ్చే ఆ డివిజన్‌లోని పాఠశాలలకు వెళ్లారు.

–ఫొటోలు: రియాజ్/ ఏలూరు



జన్మభూమి సభకు పింఛన్ పుస్తకాలతో వచ్చిన వృద్ధులు



నిరీక్షణ..





పింఛన్ సొమ్ములు ఎప్పుడిస్తారో..



వెనక్కితిరిగి వెళ్తూ..

## ప్రత్యేక హోదా పోరాటంలో

# భాగస్వాములుకండి

**వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తలారి పిలుపు**

దేవరపల్లి:

రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తోన్న పోరాటంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఆ పార్టీ గోపాలపురం నియోజకవర్గ సమన్వయకర్త తలారి వెంకట్రావు పిలుపునిచ్చారు. దేవరపల్లి మండలం గౌరీపట్నంలో మంగళవారం రచ్చబండ, పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా సాయంత్రం గ్రామంలో తలారి వెంకట్రావు, పార్టీ నాయకులు పర్యటించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా విషయంలో జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరించారు. ప్రత్యేక హోదాపై అవగాహన కల్పించి సంతకాల సేకరణ చేశారు. ప్రత్యేక హోదా ఇస్తే రాష్ట్రంలో పరిశ్రమలు వస్తాయని, దీనివల్ల నిరుద్యోగ సమస్య పరిష్కారం కావడంతో పాటు ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చునని వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు తిరిగి కట్టనవసరం ఉండదని తెలిపారు. ప్రత్యేక హోదా విషయంలో టీడీపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రత్యేక హోదాను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం వద్ద తాకట్టు పెట్టిందని ఆయన ఆరోపించారు. అయితే ప్రత్యేక హోదా వచ్చే వరకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పోరాటం కొనసాగుతుందని అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్, నాయకులు గుత్తికొండ అచ్యుతరావు, పిచ్చుకల సూరిబాబు, నేలపూడి శేఖర్, కొఠారు వెంకట సుబ్బారావు, కె.రాంబాబు పాల్గొన్నారు.



గౌరీపట్నంలో ప్రత్యేక హోదా గురించి ప్రజలకు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తలారి వెంకట్రావు

# ప్రజల సహకారంతోనే ప్రభుత్వ పాలన

**మంత్రి మాణిక్యాలరావు**

తాడేపల్లిగూడెం(తాలూకా ఆఫీస్ సెంటర్):

ప్రజల సూచనలు, సలహాలు తీసుకొని వారి సహకారంతోనే ప్రభుత్వం ముందుకు వెళుతుందని మంత్రి మాణిక్యాలరావు అన్నారు. జన్మభూమి–మా ఊరు కార్యక్రమంను పట్టణంలోని 2వ వార్డులో కౌన్సిలర్ కొల్లి రమావతి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. మంత్రి మాణిక్యాలరావు, కలెక్టర్ కాటమనేని భాస్కర్ ముఖ్య అతిథులుగా పాల్గొని జన్మభూమి –మా ఊరు కార్యక్రమం ప్రతిజ్ఞ నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పనితీరును నిరంతరం ప్రజలు గమనించాలన్నారు. గూడెంలో ఎయిరోడ్రమ్ వద్ద జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, మహిళా కళాశాల, నిట్, ఏయూ క్యాంపస్ ఒకే చోటుకు వచ్చేలా ఎడ్యుకేషన్ హబ్ తీసుకువస్తున్నట్టు తెలిపారు. ఆటో నగర్ మంజూరయిందన్నారు. జీఓ ద్వారా 2014 ముందు విమానాశ్రయ భూములలో ఉన్నట్లు ఆధారాలు చూపించిన వారికి రెగ్యులరైజ్ చేస్తామని, ఇళ్లు చేతులు మారిన వారికి కూడా రెగ్యులరైజ్ కోసం కృషి చేస్తామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్హత ఉన్నవారందరికీ పెన్షన్‌లు అందుతాయన్నారు. 11న మండల, గ్రామస్థాయిలో మీటింగ్ పెట్టి పూర్తిస్థాయిలో పెన్షన్‌లు జారీ చేస్తామన్నారు. నూటికి నూరుశాతం ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు జరిగే విధంగా చూస్తామన్నారు. గ్రామాలలో గాని, పట్టణాలలో గాని 1700 కిలో మీటర్ల సీసీ రోడ్లు మన జిల్లాలో పూర్తి చేసినట్టు తెలిపారు. మరో 1200 కిలో మీటర్లు రానున్న రోజులలో పూర్తి చేస్తామన్నారు. అలాగే అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు పూర్తి చేయనున్నట్టు చెప్పారు. అర్హులకు రేషన్‌కార్డులను అందజేశారు. మునిసిపల్ కమిషనర్ బ్రహ్మాజీ, బీజేపీ నాయకులు కోట రాంబాబు, కర్రి ప్రభాకర్ బాలాజీ, యెగ్గిన నాగబాబు, అడపా జమున, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.



మా ఊరు, జన్మభూమి కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి మాణిక్యాలరావు, కాటమనేని భాస్కర్

# చిట్టి బుర్రలు.. గట్టి ఆలోచనలు

వారంతా సామాన్య బాలలే.. కనీస వసతులకు దూరంగా ఉంటున్న కొల్లేరు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు. అయితేనే వారి మేధస్సుకు పదును పెట్టారు. చదువుతో పాటు నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టారు. ఉపాధ్యాయుల సహకారంతో నైపుణ్యానికి సానపెట్టారు. ఇటీవల పాలకొల్లులో జరిగిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ చాటారు. నెల్లూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు జిల్లా తరఫున ఎంపికై మంగళవారం పోటీలకు తరలివెళ్లారు. ఆ వివరాలు ఇలా.. – నిడమర్రు

- నూతన ప్రాజెక్ట్‌ల ఆవిష్కరణలో కొల్లేరు విద్యార్థుల సత్తా
- రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక పోటీలకు ఎంపిక
- మండలం నుంచి వరుసగా 5వ సారి రాష్ట్ర పోటీలకు..



పండుగల్లో పెరుగుతున్న పర్యావరణ కాలుష్యంపై పెదనిండ్రకొలను విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్ట్



ఆహారభద్రతలో వనరుల నిర్వహణపై పత్తేపురం విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్ట్

గత నెల 29, 30వ తేదీల్లో పాలకొల్లులో నిర్వహించిన జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు స్కూల్స్ నుంచి మొత్తం 420 ప్రదర్శనలు పోటీలో నిలిచాయి. సైన్స్ ప్రాజెక్టులకు సంబంధించి 6 అంశాలలో పోటీలు నిర్వహించారు. ఈ ఆరు అంశాల్లో వ్యక్తిగతం, గ్రూఫ్ విభాగల్లో 10 ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ 10 ప్రాజెక్టుల్లో గ్రూపు కేటగిరిలో నిడమర్రు మండలం నుంచి రెండు ప్రాజెక్టులు ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యాయి. ఐదేళ్లుగా నిడమర్రు మండలం నుంచి ఏదో ఒక స్కూల్ రాష్ట్ర పోటీల్లో పాల్గొంటూ సత్తా చాటుతున్నారు. గత ఏడాది సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడం విశేషం. తాజాగా నిడమర్రు మండలంలోని పెదనింద్రకొలను, పత్తేపురం జెడ్పీ స్కూల్ బాల మేధావులు బీకేవీ సత్య, ఎల్.కుశ్వంత్, ఎన్ఆర్వీ సత్యవతి, ఎస్ఎస్‌వీఎస్ వైష్ణవి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై ప్రతిభ చాటారు.

## ఆహార భద్రత, కాలుష్యాలపై అవగాహన

ఆహార భద్రతకు అవసరమైన 7 సూత్రాలతో కృత్యాలు తయారు చేసి నిడమర్రు మండలం పత్తేపురం జెడ్పీ స్కూల్ విద్యార్థులు ఆకట్టుకున్నారు. ×వనరుల నిర్వహణ– ఆహార భద్రత₹ విభాగంలో ఈ ప్రదర్శన రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. గైడ్ టీచర్ కె.సుబ్బరాజు, ఎస్ఏ (పీఎస్) ఆధ్వర్యంలో విద్యార్థులు ఎన్ఆర్‌వీ సత్యవతి, ఎస్ఎస్‌వీఎస్ వైష్ణవి ఈ ప్రాజెక్టు తయారు చేశారు. పాలినెట్స్ సంరక్షణ, వాతావరణానికి తగినట్టుగా ఆహార అలవాట్లలో మార్పు, నాణ్యమైన విత్తనాలు పంపిణీ, సేంద్రియ సాగు ప్రోత్సహించడం, ఆహర కల్తీపై అవగాహనపై ఈ ప్రాజెక్టు రూపొందించి ఆకట్టుకున్నారు. అలాగే పెదనింద్రకొలను జెడ్పీ స్కూల్ విద్యార్థులు మానవుని ఆరోగ్యంపై కాలుష్య ప్రభావాలు అనే విభాగంలో ప్రాజెక్టు తయారు చేశారు. పండుగల్లో పెరుగుతున్న కాలుష్య నివారణ అనే అంశంపై చేసిన ఈ ప్రాజెక్టు కూడా గ్రూప్ విభాగంలో ప్రథమ స్థానం సాధించింది. ఈ ప్రాజెక్టును గైడ్ టీచర్ చిన్నం జాకబ్‌రాజు ఎస్ఏ (ఎన్ఎస్) ఆధ్వర్యంలో విద్యార్థులు బీకేవీ సత్య, ఎల్.కుశ్వంత్ తయారు చేశారు.

### ఆహార భద్రతపై దృష్టి పెట్టాలి



ప్రపంచంలో సుమారు 300 కోట్లు మందికి ఆహార భద్రత కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ విషయం ఆలోచించి. ఆహార భద్రతపై ప్రతీ ఒక్కరూ దృష్టి పెట్టాలనే ఉద్దేశంతో ప్రాజెక్ట్ రూపొందించాం.

–ఎస్ఎస్‌వీఎస్ వైష్ణవి, జెడ్పీస్కూల్,పత్తేపురం

### కాలుష్యంపై అవగాహన ఉండాలి



దీపావళి, నూతన సంవత్సరం, ఫంక్షన్లలో బాణసంచా వినియోగిస్తున్నాం, ఆలాగే వినాయచవితి, హోలీ తదితర పండుగల్లో ప్రమాదకరమైన రంగులు వినియోగిస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నాం, మానవులపై వీటి దుష్ప్రభావాన్ని మా ప్రాజెక్ట్‌లో వివరించాం.

–బండారు కాళీ వీరసత్య, జెడ్పీస్కూల్, పెదనింద్రకొలను

### నాలుగోసారి రాష్ట్ర పోటీలకు..



పెదనింద్రకొలను స్కూల్లో పనిచేసినప్పుడు వరుసగా మూడుసార్లు రాష్ట్రస్థాయికి నా ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ప్రస్తుతం పత్తేపురంలో పనిచేస్తున్నాను. ఈ ఏడాది ఆహార భద్రతపై మా విద్యార్థుల చేత తయారు చేయించిన మా ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికవ్వడం ఆనందంగా ఉంది.

– కె.సుబ్బరాజు, గైడ్ టీచర్

### పండుగల వెనుక కాలుష్యం



ఆనందంగా జరుపుకునే పండుగల వెనుక ఉన్న కాలుష్యంపై మా విద్యార్థులు ప్రాజెక్టు రూపొందించారు. ఆధునికకాలంలో పండుగల్లో వచ్చిన మార్పులు మానవ ఆరోగ్యంపై ఎటువంటి ప్రభావం కలిగిస్తున్నాయో ప్రాక్టికల్‌గా ఈ ప్రాజెక్ట్ రూపొందించాం.

– చిన్నం జాకబ్‌రాజు, గైడ్ టీచర్

## రోలర్ స్కేటింగ్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, కోచ్

**తణుకు:** రోలర్ రిలే స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గత నెల 27 నుంచి 29 వరకు మహారాష్ట్రలో నిర్వహించిన జాతీయస్థాయి స్కేటింగ్ పోటీల్లో తణుకు స్టెప్పింగ్ స్టోన్స్ సీబీఎస్ఈ విద్యార్థులు ప్రతిభ చాటారు. తొమ్మిదో తరగతి చదువుతోన్న విద్యార్థులు కె.జగదీష్ చంద్రమౌళి 300, 500, 1000 మీటర్ల రేస్‌లో కాంస్య పతకాలు, స్కేట్‌లాన్‌లో వెండి పతకాన్ని కైవసం చేసుకోగా ఎస్.సందీప్‌రెడ్డి రిలేలో వెండి పతకం గెలుచుకున్నాడు. ఈ సందర్భంగా మంగళవారం స్కూలు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఆకుల విజయవర్ధన్ వీరిని అభినందించారు. కోచ్ లావణ్య, ప్రిన్సిపాల్ బాబు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ నిందితులకు కౌన్సెలింగ్

**ఏలూరు టౌన్ :** మద్యం సేవించి వాహనాలు నడిపిన కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని, విలువైన ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఏలూరు ట్రాఫిక్ డీఎస్పీ పి.భాస్కరరావు తెలిపారు. ఎస్పీ ఎం.రవిప్రకాష్ ఆదేశాల మేరకు నగరంలో చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వ్యక్తులకు ఆయన మంగళవారం ఉదయం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద కౌన్సిలింగ్ ఇచ్చారు. 22 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు కాగా, వారిలో 18 మందికి కోర్టు అపరాధ రుసుం విధించిందని తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ డీఎస్పీ మాట్లాడుతూ అత్యధికంగా రోడ్డు ప్రమాదాలు మద్యం సేవించి వాహనాలు నడపటం కారణంగానే జరుగుతున్నాయని, వీటి నివారణకు పోలీస్ యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టిందని చెప్పారు. రోడ్డు ప్రమాదం జరిగి ఒక ప్రాణం కోల్పోతే వారి కుటుంబ పరిస్థితి దారుణంగా దెబ్బతింటోందని, పిల్లలు అనాథలుగా మిగిలిపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయని వివరించారు. మరోసారి మద్యం సేవించి కేసులో దొరికితే కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు.



డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వ్యక్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ భాస్కరరావు

## ట్రాక్టర్ ట్రక్కు బోల్తా.. ఒకరు మృతి

ఆరుగురికి గాయాలు



పోలవరం వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

**పోలవరం రూరల్:** పోలవరం మండలంలో అత్యంత మారుమూలైన కొండలపైకి వెళుతున్న గిరిజనుల ట్రాక్టర్ ట్రక్కు తిరగబడటంతో ఆరుగురికి తీవ్రగాయాలు కావడంతో పాటు, ఒక వ్యక్తి మృతిచెందాడు. వివరా లు ఇలా ఉన్నాయి. మంగళవారం సంతకావడంతో మెత్తాపుకోట, ఉడతపల్లి గ్రామాలకు చెందిన గిరిజనులు మండల కేంద్రమైన పోలవరంలో జరిగే సంతకు రెండు ట్రాక్టర్‌లపై వచ్చారు. వీరు నిత్యావసర వస్తువులు, సరుకులు కొనుగోలు చేసుకుని తిరిగి బయలుదేరారు. ఘాటీకి చేరుకునే సరికి ట్రాక్టర్ ట్రక్కు వెనక్కి లేచిపోవడంతో ట్రక్కులో ఉన్న పలువురు వెనక్కి పడిపోయారు. దీంతో అందరికీ గాయాలయ్యాయి. వీరిలో ఒకరు మృతి చెందినట్టు తెలిసింది. స్థానికులు క్షతగాత్రులను ఆటోలు, మోటార్ సైకిళ్లపై పోలవరం వైద్యశాలకు తరలించారు. నూనె వీరాయమ్మ, మడకం లక్ష్మి, మడకం పెంటాయమ్మ, మూలెం ఆశాదేవి, మడకం ఎర్రయ్యలు చికిత్స పొందుతున్నారు. మెత్తాపుకోట గ్రామానికి చేరుకునే సమీపంలో ఈ ఘటన జరిగినట్టు ఘటనాస్థలంలో ఉన్న వారు తెలిపారు. పోలవరం ఎస్సై కె.శ్రీహరిరావు పోలవరం వైద్యశాలకు వెళ్లి క్షతగాత్రుల నుంచి వివరాలు సేకరించారు.

## ప్రభుత్వాసుపత్రి ఉద్యోగులకు నేమ్ బ్యాడ్జీలు



ఉద్యోగులకు నేమ్ బ్యాడ్జీలు అందజేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ ఏవీఆర్ మోహన్

**ఏలూరు టౌన్ :** ఏలూరు ప్రభుత్వాసుపత్రిలోని అన్ని విభాగాలకు చెందిన ఉద్యోగులకు నేమ్ బ్యాడ్జీలను ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏవీఆర్ మోహన్ అందజేశారు. వైద్య, ఆరోగ్యశాఖలో ఆయా విభాగాలకు సంబంధించి ఉద్యోగులకు కేటగిరి వారీగా వివిధ రంగుల్లో నేమ్ బ్యాడ్జీలు అందజేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తోన్న ఉద్యోగులకు నేమ్ బ్యాడ్జీలను పంపిణీ చేశారు. వైద్యులకు గ్రీన్ కలర్, నర్సులకు బ్లూ కలర్, నాలుగో కేటగిరి ఉద్యోగులకు ఎల్లో కలర్, టెక్నీషియన్లకు రెడ్ కలర్, ఆఫీస్ స్టాఫ్‌కు గోల్డెన్ కలర్ నేమ్ బ్యాడ్జీలు అందజేశారు. విధుల్లో ప్రతి ఒక్క ఉద్యోగి ఈ నేమ్ బ్యాడ్జీలను విధిగా ధరించాలని ఆయన ఆదేశించారు.

## ఉపాధ్యాయుల సమస్యలపై యూటీఎఫ్ వినతి

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** మున్సిపల్ ఉపాధ్యాయుల పదోన్నతులకు అవసరమైన క్లారిఫికేషన్లు విడుదల చేయాలని కోరుతూ మంగళవారం రాష్ట్ర సచివాలయంలో మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి కరికాలవలవన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించామని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సాబ్జీ తెలిపారు. నగరంలోని నగరపాలక సంస్థ పాఠశాలలను సందర్శించిన సాబ్జీ అక్కడ ఉపాధ్యాయులతో మాట్లాడారు. మున్సిపల్ ఉపాధ్యాయుల పదోన్నతులపై క్లారిఫికేషన్లు ప్రాతినిధ్యం మేరకు వెంటనే విడుదల చేస్తామని కరికాలవలవన్ హామీ ఇచ్చారని వివరించారు. అలాగే ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలపైనా పోరాడుతున్నట్టు చెప్పారు.

## 5న కారెం శివాజీ పర్యటన

**ఏలూరు (మెట్రో):** ఏపీ షెడ్యూలు కులాలు, తెగల కమిషన్ చైర్మన్ కారెం శివాజీ ఈ నెల 5న ద్వారకా తిరుమల మండలం కోడిగూడెం గ్రామం రానున్నారు. స్థానికంగా ప్రయివేటు కార్యక్రమంలో పాల్గొని రాత్రికి మాగం చేరుకుని బస చేస్తారు. ఈ నెల 6న ఉదయం తూర్పు గోదావరి జిల్లా పర్యటన నిమిత్తం వెళ్తారు. తిరిగి ఈనెల 7న మధ్యాహ్నం జంగారెడ్డిగూడెం చేరుకుని రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. సాయంత్రం అక్కడే యానాదుల మహాసభకు హాజరవుతారు. అనంతరం 6 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి విజయవాడ చేరుకుంటారు.

## ముమ్మరంగా వరినాట్లు

• సాగునీటి ఎద్దడితో కొన్నిచోట్ల ఆలస్యం



ఓడూరు ప్రాంతంలో పూర్తయిన వరినాట్లు

ఆలమూరు (పెనుమంట్ర): మండల వ్యాప్తంగా దాళ్వా వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి. మండలంలోని 18 గ్రామాల్లో 5,420 హెక్టార్ల విస్తీర్ణంలో వరిసాగు చేస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. కాగా ఇప్పటి వరకు దాదాపు 80 శాతం నాట్లు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. ఈసారి ఎక్కువ మంది రైతులు 1125, 1010, బొండాల రకాలను సాగు చేస్తున్నారు. మండలంలో సాగు నీటి కొరత కారణంగా సత్యవరం, కొయ్యేటిపాడు ఆయకట్టులో నాట్లు ఆలస్యం అవుతున్నాయి. రేలంగి కాలువలో నీటి పరిమాణం అతి తక్కువగా ఉంటోందని రైతులు వాపోతున్నారు. ఈ కారణంగా జుత్తిగ, నత్తారామేశ్వరం ఆయకట్టులోనూ నాట్లు ఆలస్యం అవుతున్నాయని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోనే ఎక్కువ మెరక భూములున్న ఎస్.ఇల్లింద్రపర్రు, మల్లిపూడి గ్రామ రైతులు కూడా ఇంకా చేలు దమ్ములు చేస్తున్నారు. మొత్తంగా 15 రోజులు ఆలస్యంగా ఈనెల 10 నాటికి నూరు శాతం నాట్లు పూర్తవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

## కబడ్డీలో విశ్వతేజ విద్యార్థుల ప్రతిభ



కబడ్డీ టీం సభ్యులు

పెనుగొండ: స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల సందర్భంగా యువజన సర్వీసుల విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల పోటీల్లో పెనుగొండ విశ్వతేజ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి కబడ్డీలో ప్రథమ స్థానం పొందారని కళాశాల ప్రిన్సిపాల్ పులిగెడ్డ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను సెక్రటరీ, కరస్పాండెంట్ ఎం.నాగబాబు అభినందించారు.

## క్రీస్తు చూపిన మార్గంలో పయనించాలి



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న పాస్టర్లు శామ్యూల్, జాన్‌మోరిస్

ఆచంట: ప్రతి ఒక్కరూ క్రీస్తు చూపిన మార్గంలో పయనించాలని పాస్టర్ కుసుమె శామ్యూల్ సూచించారు. సోమవారం రాత్రి కొడమంచిలి టీ మెరక క్రీస్తు ప్రార్థనా మందిరంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చర్చి పాస్టరు శామ్యూల్ కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానవాళి మనుగడకు ఏసుక్రీస్తు బాసటగా నిలిచారని, క్రీస్తు బోధనలు సర్వమానవాళికి అనుసరణీయమని చెప్పారు. వేడుకల్లో పాస్టర్ జాన్‌మోరిస్, ఏఎంసీ చైర్మన్ ఉప్పలపాటి సురేష్‌బాబు, సర్పంచ్ చిలుకూరి శ్రీనివాసు, ఎంపీటీసీ సుంకర సీతారామ్, టీడీపీ నాయకుడు బీరా నర్సింహమూర్తి, ఉపాధ్యాయులు కుసుమె ధర్మాంగధరావు, కోట పెద్దిరాజు, కాంపాటి కాశీ ,విశ్వాసులు పాల్గొన్నారు.

# వినూత్న క్రీడలను ప్రోత్సహించాలి

పెనుగొండ:

సాధారణ క్రీడలతో పాటు ఫెన్సింగ్ వంటి వినూత్న క్రీడలను ప్రభుత్వం ప్రోత్సహించాలని ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్ర రాజు అన్నారు. ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయ ఫెన్సింగ్ జట్టు ఎంపికను కళాశాలలో నిర్వహించారు. అనంతరం సమావేశంలో మాట్లాడుతూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ప్రణాళికలు రూపొందించడం వల్ల విపత్తుల నిర్వహణపై రెండు రోజుల శిక్షణ శిబిరం, యువ మహోత్సవ్, ఫెన్సింగ్ జట్టు ఎంపిక విజయవంతంగా నిర్వహించగలిగామన్నారు. జట్టు ఎంపికకు 42 మంది క్రీడాకారులు హాజరు కాగా ఎనిమిది మందిని ఎంపిక చేసినట్టు పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎంపిక బోర్డు మెంబర్ కే అమ్మన్న చౌదరి తెలిపారు. డి.సాయికృష్ణ, ఎన్.సుధీర్ కుమార్, కె.కతీష్ చంద్రారెడ్డి, బి అశోక్, యా.నిఖిల్, వై.సాయి దిలీప్ కుమార్, డి హవిలనిస్సి, పి.లక్ష్మి ఎంపికయ్యారు. రాజోలు సిద్ధార్థ, కాకినాడ ఆదిత్య డిగ్రీ, పెద్దాపురం ఎంఆర్, గొల్లల మామిడాడ డీఆర్‌కే వ్యాయామ, తణుకు ఎస్కేఎస్‌డీ ప్రభుత్వ కళాశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. పశ్చిమగోదావరి ఫెన్సింగ్ క్రీడాకారుల సంఘ కార్యదర్శి ఎన్.సతీష్, టి.కల్యాణి, పి.శ్రీనివాస్, జి.కృష్ణమోహన్, పాలకవర్గ కోశాధికారి ఉద్దగిరి లవకుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నడింపల్లి సూర్యనారాయణ రాజు, పీడీ బి.బాపిరెడ్డి పాల్గొన్నారు.



ఫెన్సింగ్ క్రీడలో తలపడుతున్న క్రీడాకారులు



క్రీడాకారులను అభినందిస్తున్న డాక్టర్ రాజు

# ప్రభుత్వ ప్రచారంతో..వృద్ధులకు పాట్లు

పెనుగొండ: ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన జన్మభూమి కార్యక్రమం వృద్ధుల పాలిట శాపంగా మారింది. మంగళవారం నుంచి జన్మభూమి కార్యక్రమాలు ప్రారంభం కావడంతో ప్రతి రోజూ పంచాయతీల వద్ద ప్రత్యేక క్యాలెండర్ రూపొందించి గ్రామసభలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీని ప్రకారం మంగళవారం ప్రభుత్వ సంక్షేమంపై ప్రచారం నిర్వహించారు. దీనికి చంద్రబాబు చాంతాడంత ఉపన్యాసాన్ని టీవీల్లో ప్రచారం చేయడంతో పాటు ప్రభుత్వ పథకాలను ఏకరువు పెట్టారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ప్రతీ నెలా ఒకటో తేదీ నుంచి ఐదో తేదీ వరకు పింఛన్లు పంపిణీ చేసే కార్యక్రమాన్ని జన్మభూమికి అన్వయించారు. దీంతో వీరంతా గ్రామసభల వద్ద పింఛను తీసుకోవడానికి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. నియోజక వర్గంలోని అన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. జన్మభూమి సభల వద్ద ఉండకపోతే పింఛను ఇచ్చేది లేదంటూ అధికారులు చెప్పడంతో ఉదయం 8 గంటలకు వెళ్లిన వృద్ధులు రాత్రి ఏడు గంటల వరకూ వేచి ఉండాల్సి వచ్చింది. తిండీ తిప్పలు లేక అల్లాడిపోయారు. జన్మభూమి సభలకు ప్రజలు తక్కువగా వస్తుండటంతో వృద్ధులను బలిచేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆర్భాటపు ప్రచారాలకు పింఛన్ల పంపిణీకి ముడి పెట్టడం మానుకోవాలని సూచిస్తున్నారు.



రాత్రి వరకు పడిగాపులు పడుతున్న వృద్ధులు

## సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

పోడూరు: జన్మభూమి–మాఊరు కార్యక్రమంలో ప్రజలు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఎంపీపీ గుంటూరి వాణి పెద్దిరాజు పిలుపునిచ్చారు. మండలంలో మూడో తేదీ నుంచి జన్మభూమి సభలు ప్రారంభం కానుండడంతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీపీ వాణి పెద్దిరాజు సమావేశానికి అధ్యక్షత వహించారు. జన్మభూమి కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ బొక్కా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. తహసీల్దార్ కె.శ్రీరమణి, ఎంపీడీఓ ఎంకే ప్రసన్న, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# కనుల పండువగా పౌర్ణమి హోమాలు



పెనుగొండలో చండీ హోమం



కొఠాలపర్రులో సుదర్శన హోమం

పెనుగొండ: పౌర్ణమి పురస్కరించుకుని పెనుగొండ నగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో చండీ హోమం, కొఠాలపర్రు స్వయంభుః కేశవస్వామి ఆలయంలో సుదర్శన హోమాలు కనుల పండువగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు. అనంతరం హోమం నిర్వహించారు. పెనుగొండలో నిర్వహించిన చండీ హోమంలో గంధం వెంకట్రాజు శ్రీదేవి దంపతులు, కర్రి వేణుబాబు గౌరి సుభాషిణి దంపతులు, నాగేశ్వరరావు ధనలక్ష్మి దంపతులు, ఎంఆర్వీ సత్యనారాయణమూర్తి రాజేశ్వరి దంపతులు, లీలాకృష్ణ సూర్యకుమారి దంపతులు, గురునాథరావు నీలవేణి దంపతులు పాల్గొన్నారు. అనిపెద్ది సాయి కృష్ణ శాస్త్రోక్తంగా హోమాన్ని నిర్వహించారు. కొఠాలపర్రులో జరిగిన సుదర్శన హోమంలో టి.శ్రీనివాసు, సునీత దంపతులు పాల్గొన్నారు.

## వెండితెర



ఆచంట

| | | |
|---|---|---|
| కళ్యాణచక్రవర్తి | : | ఒక్క క్షణం |

పెనుగొండ

| | | |
|---|---|---|
| మినర్వా | : | కాష్మోరా |

పాలకొల్లు

| | | |
|---|---|---|
| గీతా అన్నపూర్ణ | : | హలో |
| మారుతి | : | ఎంసిఏ |
| అడబాల స్క్రీన్ 1 | : | ఎంసీఏ |
| అడబాల స్క్రీన్ 2 | : | హలో |
| శ్రీనివాస డీలక్స్ | : | ఆక్సిజన్ |
| శ్రీనివాస మినీ | : | రాజుగారి గది 2 |
| శ్రీనివాస డిజిటల్ | : | ఇఠ |
| రంజని | : | సప్తగిరి ఎల్ఎల్‌బీ |

# ఖండన బిందువు భూమి నుంచి ఎంత ఎత్తులో ఉంది?




యార్లగడ్డ వనరాజు
స్కూల్ అసిస్టెంట్,
ప్రభుత్వ ఉన్నత పాఠశాల

## సరూప త్రిభుజాలు

### సమస్యలు-సమాధానాలు

**1.** 4 మీటర్లు, 6 మీటర్ల ఎత్తున్న రెండు స్తంభాలు 25 మీటర్ల దూరంలో నిటారుగా ఉన్నాయి. మొదటి స్తంభం కొనను రెండో స్తంభం పాదంతో, రెండో స్తంభం కొనను మొదటి స్తంభం పాదంతో కలిపే రేఖల ఖండన బిందువు భూమి నుంచి ఎంత ఎత్తులో ఉంది?




**జ.** రెండు స్తంభాల ఎత్తులు AB = 4 మీ, CD = 6 మీ. అనుకోండి. భూమి నుంచి ఖండన బిందువు ఎత్తు PQ= z మీ. అనుకుంటే

ΔPQB, ΔCDBల్లో $\angle B = \angle B$ (ఉమ్మడి కోణం)

$\angle BQP = \angle BDC = 90^\circ$

కో.కో. నియమం ప్రకారం

ΔPQB ~ ΔCDB అవుతుంది.

అప్పుడు

$\frac{BQ}{BD} = \frac{PQ}{CD} = \frac{z}{6}$ —— (1) ఇదేవిధంగా

ΔPQD~ΔABD

అని చూపొచ్చు. అప్పుడు

$\frac{QD}{BD} = \frac{PQ}{AB} = \frac{z}{4}$ —— (2)


1, 2 లను కలిపితే $\frac{BQ}{BD} + \frac{QD}{BD} = \frac{z}{6} + \frac{z}{4}$

$\Rightarrow \frac{BQ+QD}{BD} = z\left(\frac{1}{6}+\frac{1}{4}\right)$

$\Rightarrow \frac{BD}{BD} = z\left(\frac{2+3}{12}\right) \Rightarrow 1 = z\left(\frac{5}{12}\right)$

$\Rightarrow z = \frac{12}{5} \times 1 = 2.4$ మీ.


■ **గమనిక:** ఈ సమస్యను పోలి ఉన్న సమస్య.. AB, CD, PQలు BDకి గీసిన లంబాలు AB=x, CD=y, PQ=z అయితే $\frac{1}{x}+\frac{1}{y}=\frac{1}{z}$ అని చూపండి అనే సమస్యతో పోలి ఉంటుంది.





**2.** ΔABCలో DE||BC, $\frac{AD}{DB}=\frac{3}{4}$, AC=15 సెం.మీ., అయితే AE విలువ ఎంత?

**3.** ΔABCలో DE||BC, AD= 4x–3, AE=8x–7, BD= 3x–1, CE= 5x–3 అయితే x విలువ కనుగొనండి.

**4.** కింది పటంలో AB||CD||EF, AB = 7.5 సెం.మీ. DC = y సెం.మీ., EF = 4.5 సెం.మీ., BC = x సెం.మీ. అయితే x, y విలువలు కనుగొనండి.




**5.** కింది పటంలో A, B, Cలు వరుసగా OP, OQ, ORలపై బిందువులు. AB||PQ, AC||PR అయితే BC||QR అని చూపండి.




### పైథాగరస్ సిద్ధాంతం (బౌధాయన సిద్ధాంతం)


'లంబకోణ త్రిభుజంలో కర్ణం మీది వర్గం మిగిలిన రెండు భుజాల వర్గాల మొత్తానికి సమానం.'

విపర్యయంగా 'ఒక త్రిభుజంలో ఒక భుజం మీది వర్గం మిగిలిన రెండు భుజాల వర్గాల మొత్తానికి సమానమైతే అది లంబకోణ త్రిభుజం.'

లంబకోణ త్రిభుజం ΔABCలో

∠B =$90^0$ అయితే..


$(AC)^2 = (AB)^2+(BC)^2$




### మాదిరి ప్రశ్నలు

**1.** 5 మీటర్లు, 12 మీటర్ల ఎత్తున్న రెండు స్తంభాలు నిటారుగా ఒక చదునైన నేలపై ఉన్నాయి. భూమిపై ఆ రెండు స్తంభాల అడుగు భాగాల మధ్య దూరం 12 మీటర్లు అయితే ఆ రెండు స్తంభాల పై భాగాల మధ్య దూరం ఎంత?

**జ.**




AB, CD రెండు స్తంభాలు అనుకుంటే..

దత్తాంశం ప్రకారం AB = 5 మీ., CD = 12 మీ.

నేలపై స్తంభాల మధ్య దూరం CD = 24 మీ.

పైభాగంలో రెండు స్తంభాల మధ్య దూరం AC = x మీ. అనుకుంటే..

పటం నుంచి AE = 24 మీ.,

CE = CD–DE =12 – 5 = 7 మీ.


లంబకోణ త్రిభుజం ΔAECలో పైథాగరస్ సిద్ధాంతం ప్రకారం

$x^2 = 24^2 + 7^2 \Rightarrow x^2 = 24^2 + 7^2$

$\Rightarrow x^2 = 625 \Rightarrow x = 25$

∴ పైభాగంలో రెండు స్తంభాల మధ్య దూరం = 25 మీ.

**2.** లంబకోణ త్రిభుజం ABCలో లంబకోణ శీర్షం C వద్ద ఉంది. P, Qలు వరుసగా AC, BCలపై ఉన్నాయనుకోండి. అయితే $AQ^2+BP^2= AB^2+PQ^2$ అని చూపండి.







**జ.** లంబకోణ త్రిభుజాలు ΔACQ, ΔPCB ల నుంచి

$(AQ)^2=(AC)^2 + (QC)^2$,

$(BP)^2 = (BC)^2 + (CP)^2$


$\Rightarrow (AQ)^2 + (BP)^2 = [(AC)^2+(QC)^2] + [(BC)^2+ (CP)^2] =$

$[(AC)^2+(BC)^2] + [(QC)^2+(CP)^2]$

$= AB^2 + PQ^2$

(∵ లంబకోణ త్రిభుజం ABC, PQC ల నుంచి $AB^2= AC^2+BC^2$, $PQ^2= PC^2+ QC^2$)

**3.**




పై రాంబస్‌లోని రెండు కర్ణాలు వరుసగా 24 సెం.మీ., 10 సెం.మీ. అయితే దాని భుజం పొడవు కనుక్కోండి.

**జ.** రాంబస్‌లో కర్ణాల వర్గాల మొత్తం.. భుజాల వర్గాల మొత్తానికి సమానం. అంటే..

$(AC)^2+(BD)^2 =$

$(AB)^2+(BC)^2+ (CD)^2 +(DA)^2$

రాంబస్‌లో AB= BC= CD=DA కాబట్టి

$(AC)^2+(BD)^2=$

$(AB)^2+(AB)^2+(AB)^2+(AB)^2 = 4AB^2$

$\Rightarrow (24)^2+(10)^2= 4(AB)^2$


$\Rightarrow 576+100 = 4(AB)^2$

$\Rightarrow 676 = 4(AB)^2 \Rightarrow 169 = (AB)^2$

∴ AB = 13 సెం.మీ.

**4.** 5 సెం.మీ., 12 సెం.మీ., 13 సెం.మీ. భుజాల పొడవులుగా ఉన్న త్రిభుజం ABCలో 13 సెం.మీ. పొడవు ఉన్న భుజానికి దాని ఎదుటి శీర్షం నుంచి గీచిన లంబం పొడవు కనుక్కోండి.

**జ.** 5, 12, 13 సెం.మీ. భుజాల పొడవులుగా గల త్రిభుజం లంబకోణ త్రిభుజం అవుతుంది. (∵$13^2 = 5^2 +12^2$)




AB =13 సెం.మీ., BC = 5 సెం.మీ., AC=12 సెం.మీ. అయినట్లు ABC ఒక లంబకోణ త్రిభుజం అనుకోండి.

13 సెం.మీ. పొడవున్న భుజానికి



గీసిన లంబం CD = p సెం.మీ. అనుకోండి.

ΔABC వైశాల్యం$=\frac{1}{2}$ భూమి × ఎత్తు

$=\frac{1}{2}\times BC\times AC = \frac{1}{2}\times 5\times 12 = 30cm^2$

ΔABC వైశాల్యం$=\frac{1}{2}$ భూమి×ఎత్తు

$=\frac{1}{2}\times AB\times CD = \frac{1}{2}\times 13\times p$


$\Rightarrow \frac{1}{2}\times 13\times p = 30 \quad \Rightarrow p = \frac{60}{13}$

= 4.6 సెం.మీ. (సుమారుగా)

**5.** కింది పటం నుంచి


i) pc= ab,

ii) $\frac{1}{p^2} = \frac{1}{a^2} + \frac{1}{b^2}$ అని చూపండి.




**6.** ఒక సమబాహు త్రిభుజంలో భుజాల వర్గాల మొత్తానికి 3 రెట్లు, ఆ త్రిభుజం మధ్య గతాల వర్గాల మొత్తానికి 4 రెట్లకు సమానమని చూపండి.

**7.** లంబకోణ త్రిభుజం ΔABCలో $\angle B = 90^\circ$ AD, CEలు మధ్యగత రేఖలు AC= 5 సెం.మీ., $AD = \frac{3\sqrt{5}}{2}$ అయితే CE విలువ కనుక్కోండి.




**8.** (a–1) సెం.మీ. 2√a సెం.మీ. (a+1) సెం.మీ. భుజాలుగా ఉన్న త్రిభుజం లంబకోణ త్రిభుజం అవుతుందా?

**9.** 5 మీ, 12 మీ, 13 మీ. భుజాలుగా గల త్రిభుజం లంబకోణ త్రిభుజం అవుతుందా? కారణాలు చెప్పండి.

# Affixation is the process of adding..



R. Srinivasa Rao
*Senior Faculty, Hyderabad*






## AFFIXATION

An affix is used to alter the meaning or form of a word. It can be either a Prefix or a Suffix.

***Definition:*** Affixation is the process of adding a morpheme - or affix - to a word to create either a different form of that word or a new word with a different meaning.

The two primary kinds of 'Affixation' are prefixation, the addition of a prefix, and suffixation, the addition of a suffix, while clusters of affixes can be used to form complex words.

***Prefixes:*** A prefix is a letter or group of letters attached to the beginning of a word that partly indicates its meaning.

| *Prefix* | *Meaning* | *Examples* |
|---|---|---|
| A | Not | Amoral, Apolitical, Atypical |
| Anti | Against, Opposite of | Antiseptic, Anti-American, Antinuclear, Anti climax, Antiaircraft, Antibody |
| Bi | Two | Bicycle, Bisect, Bilingual |
| Co | With, Together | Copilot, Co-worker, Coexist, Co-author |
| De | Down, Off | Devalue, Deactivate, Degrade, Delink |
| Dis | Opposite of | Ddisappear, Disagreeable, Disbar, Disagree, Dislike, Disobey |
| En | Put into, Cover with | Enclose, Entangle, Enslave, Encase |
| Ex | Former | Ex-president, Ex-serviceman |
| Hyper | Over, More, Beyond | Hyperactive, Hypersensitive, Hypercritical |
| Il, Im, In, Ir | Not, Without | Illegal, Illogical, Immoral, Immeasurable, Inconsiderate, Incurable, Irresponsible |
| Omni | All, Every | Omnivorous, Omniscient, Omnipotent, Omnipresent |
| Post | After | Postmortem, Posterior, Postscript |
| Tri | Three | Tricycle, Triangle, Triathlon |
| Over | Too much, Across | Over-confident, Over-populated |
| Un | Opposite | Unhappy, Unfair, Untrue |
| Vice | Next in rank | Vice-president, Vice-principal, Vice-chancellor, Vice-admiral |

***Note:*** The difference between prefixes and suffixes is that while prefixes do not change word class (noun to verb or adjective to noun) etc. suffixes mostly change the word class.



## Previous and Model Questions

1. Identify the correct suffix for the words given below: *(AP TET - 2015)*

| *Word* | *Suffix* |
|---|---|
| (a) Doubt | (i) ness |
| (b) High | (ii) ful |
| | (iii) ment |

1) (a)-(ii), (b)-(iii)
2) (a)-(iii), (b)-(ii)
3) (a)-(ii), (b)-(i)
4) (a)-(iii), (b)-(iii)

**A:** (3) Doubtful, Highness.

### EXERCISE - I

1. Identify the correct suffixes for the words given below:

| *Word* | *Suffix* |
|---|---|
| (a) Remark | (i) ise |
| (b) Discover | (ii) let |
| (c) Book | (iii) ify |
| (d) Popular | (iv) able |
| (e) Pure | (v) y |

1) (a) - (ii), (b) - (iii), (c) - (iv), (d) - (i), (e) - (v)
2) (a) - (iv), (b) - (i), (c) - (ii), (d) - (iii), (e) - (v)
3) (a) - (iv), (b) - (v), (c) - (ii), (d) - (i), (e) - (iii)
4) (a) - (iv), (b) - (i), (c) - (v), (d) - (iii), (e) - (ii)

**A:** (3)

### EXERCISE - II

1. Identify the correct suffixes for the words given below.

| *Word* | *Suffix* |
|---|---|
| (a) Virtue | (i) ize |
| (b) Love | (ii) ive |
| (c) Terror | (iii) able |
| (d) Abuse | (iv) ful |
| (e) Thank | (v) ous |

1) (a) - (v), (b) - (iii), (c) - (iv), (d) - (i), (e) - (ii)
2) (a) - (v), (b) - (iii), (c) - (i), (d) - (ii), (e) - (iv)
3) (a) - (iii), (b) - (iv), (c) - (i), (d) - (ii), (e) - (v)
4) (a) - (iii), (b) - (v), (c) - (i), (d) - (iv), (e) - (ii)

**A:** (2)

***Suffixes:*** A suffix is a letter or group of letters added at the end of a word to make a new word.

1. The following adjectives get converted into nouns by adding certain suffixes which change the word class of the basic word.

| *Adjective* | *Suffix* | *Noun* |
|---|---|---|
| Free | -dom | Freedom |
| Wise | -dom | Wisdom |
| Important | -ance | Importance |
| Permanent | -ence | Permanence |
| False | -hood | Falsehood |
| Active, Civil, Human, Real | -ity | Activity, Civility, Humanity, Reality |
| Dark, Happy, Mad | -ness | Darkness, Happiness, Madness |
| Hard | -ship | Hardship |
| Long, Strong | -th | Length, Strength |

2. Here are some examples of a verb getting converted into a noun.

| *Verb* | *Suffix* | *- Noun* |
|---|---|---|
| Leak | -age | Leakage |
| Shrink | -age | Shrinkage |
| Waste | -age | Wastage |
| Arrive, Refuse | -al | Arrival, Refusal |
| Accept, Appear | -ance | Acceptance, Appearance |
| Assist, Inhabit | -ant | Assistant, Inhabitant |
| Build, Meet, Teach | -ing | Building, Meeting, Teaching |

3. Here are a few examples of a noun forming a new word which is also a noun.

| *Noun* | *Suffix* | *Noun* |
|---|---|---|
| King | -dom | Kingdom |
| History | -ian | Historian |
| Hero | -ism | Heroism |
| Drama, Motor | -ist | Dramatist, Motorist |

4.

| *Adjective* | *Suffix* | *Verb* |
|---|---|---|
| Cheap, Deep, Sharp | -en | Cheapen, Deepen, Sharpen |
| Just, Pure | -ify | Justify, Purify |

5.

| *Noun* | *Suffix* | *Verb* |
|---|---|---|
| Length | -en | Lengthen |
| Strength | -en | Strengthen |
| Class | -ify | Classify |
| Apology | -ise | Apologise |

6.

| *Noun* | *Suffix* | *Adjective* |
|---|---|---|
| Comfort | -able | Comfortable |
| Culture | -al | Cultural |
| Element | -ary | Elementary |
| Point | -end | Pointed |
| Gold | -en | Golden |
| Beauty | -ful | Beautiful |
| Help | -ful | Helpful |
| Sense | -ible | Sensible |

7.


| *Verb* | *Suffix* | *Adjective* |
|---|---|---|
| Read | -able | Readable |
| Resist | -ant | Resistant |
| Digest | -ible | Digestible |
| Prohibit | -ive | Prohibitive |

8.


| *Adjective* | *Suffix* | *Adverb* |
|---|---|---|
| Happy | -ly | Happily |
| Foolish | -ly | Foolishly |
| Melodious | -ly | Melodiously |
| Great | -ly | Greatly |
| Artistic | -ly | Artistically |

# అంకెలు కలపండి రంగులు వేయండి





పక్కన కింద ఇచ్చిన బొమ్మల పేర్ల మొదటి అక్షరాలను వాటి పైన ఉన్న ఖాళీ గళ్లలో రాయండి. పక్కనే ఉన్న కొంగ పేరు ఇంగ్లీషులో వస్తుంది. కనుక్కోండి. →




కనుక్కోండి

గుర్తించండి


కింద మధ్యలో ఉన్న రంగుల బొమ్మ అసలైన నీడ ఏదో గుర్తించండి. ↓





పైన ఉన్న A కింద ఉన్న Z దగ్గరకు వెళ్లాలి. దారి చూపండి.


**కింద ఇచ్చిన గుడ్డులోనుంచి వస్తున్న బాతు బొమ్మను పక్కన ఖాళీ గళ్లలో గీసి రంగులు వేయండి.**



జవాబులు: కనుక్కోండి: Flamingo గుర్తించండి: F

నాన్నా చెప్పవా

# సౌర మండలానికి అవతల అన్నీ పెద్ద గ్రహాలే ఉంటాయా?




మన సౌరమండలంలో సూర్యుని చుట్టూ నిర్దిష్ట కక్ష్యలలో పరిభ్రమిస్తూ 8గ్రహాలు, 166కు పైగా ఉపగ్రహాలు, కొన్ని మరుగుజ్జు గ్రహాలు, కొన్ని వేల కోట్ల సంఖ్యలో ఆస్టరాయిడ్లు, తోకచుక్కలు, ఉల్కలు వంటి ఖగోళ నిర్మాణాలు, ఇంకా అపారమైన నక్షత్ర ధూళి ఉన్న సంగతి అందరికీ తెలిసిందే. మన సౌరమండలానికి వెలుపల కూడా ఇతర నక్షత్రాల వద్ద ఇలాంటి ఖగోళ నిర్మాణాలు ఉండి ఉండవచ్చునని అంచనా వేసిన శాస్త్రజ్ఞులు, ఆ దిశగా, అంటే అలాంటి వాటి ఉనికిని కనుగొనే దిశగా తమ ప్రయత్నాలను ఏనాడో మొదలుపెట్టారు.

1995లో తొలిసారిగా సౌరమండలానికి వెలుపల వేరే నక్షత్రం చుట్టూ తిరిగే ఒక గ్రహాన్ని శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. దీనికి ‘51 Pegasi B’ అని పేరు పెట్టారు. అప్పటి నుంచి ఇప్పటి దాకా వేరే నక్షత్రాల చుట్టూ పరిభ్రమించే అలాంటి 200కు పైగా గ్రహాలను శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. అయితే ఇటీవల కనుగొన్న ఒక గ్రహాన్ని తప్పించి మిగతా వాటినన్నింటినీ పరోక్ష పద్ధతిలోనే కనుగొనడం జరిగింది. ఒక నక్షత్రం చుట్టూ పరిభ్రమించే ఒక గ్రహం దాని పరిభ్రమణంలో భాగంగా అప్పుడప్పుడూ ఆ నక్షత్రానికి అడ్డుగా వచ్చి, దాని కాంతిని కొంచెం మందగింప జేస్తుంది. సరిగ్గా దీనిని, ఇలాంటి మరి కొన్ని కారణాలను ఆధారంగా చేసుకునే శాస్త్రజ్ఞులు ఇతర నక్షత్రాలకు సంబంధించిన గ్రహాలను కనుగొంటున్నారు.

ఇప్పటి వరకు శాస్త్రజ్ఞులు కనుగొన్న ఇతర నక్షత్రాల గ్రహాలన్నీ మన గురుగ్రహం, లేదా అంతకన్నా ఎంతో పెద్దగా ఉండడం విశేషం. ఇటీవల శాస్త్రజ్ఞులు ప్రత్యక్ష పద్ధతిలో (ఫొటోల ద్వారా) కనుగొన్న ఓ గ్రహం మన గురుగ్రహం అంత పెద్దగా ఉండటమే గాక, దీనికి 8 రెట్లు ఎక్కువ ద్రవ్యరాశితో వుంది.

ఏ నక్షత్రానికి చెందిన గ్రహాలైనా, మన సౌరమండలానికి చాలా దూరంగా (కొన్ని వేల కోట్ల మైళ్ళు) ఉండే కారణంగా కేవలం భారీ సైజులోను,, అధిక ద్రవ్యరాశితోను వుండే గ్రహాలు మాత్రమే మన కంటపడుతున్నాయని, మన సాంకేతిక విజ్ఞానం మరింత అభివృద్ధి చెందినప్పుడు సుదూర ప్రాంతాలలో ఉండే చిన్న చిన్న గ్రహాలను కూడా కనిపెట్టడానికి వీలవుతుందని శాస్త్రజ్ఞులు అంటున్నారు.

**కింద ఉన్న రెండు బొమ్మల మధ్య 10 తేడాలు ఉన్నాయి. గుర్తించండి.**





# 8 నుంచి జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన

• ఆవులు, గేదెల పాలపోటీలు కూడా • చెరుకువాడ శ్రీరంగనాథరాజు వెల్లడి

పెంటపాడు :

జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన, ఆవులు, గేదెల పాలపోటీలను ఈనెల 8 నుంచి మూడు రోజులపాటు పెదతాడేపల్లిలోని భారతీయ విద్యా భవన్స్‌లో నిర్వహించనున్నట్టు ఆ సంస్థ చైర్మన్, దేశీయ గోజాతి సంవర్ధక అసోషియేషన్ అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలిపారు. మంగళవారం ఆయన భారతీయ విద్యా భవన్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. పోటీల ప్రారంభోత్సవంలో రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సి.హెచ్.ఆదినారాయణరెడ్డి, దేవాదాయశాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు, కలెక్టర్ కె.భాస్కర్ ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని వివరించారు. మూడు విభాగాల్లో ఎడ్ల బలప్రదర్శన పోటీలు జరుగుతాయని, సీనియర్, సబ్ జూనియర్, వ్యవసాయ విభాగంలో పోటీలు ఉంటాయని వివరించారు. అలాగే ఒంగోలు, గిర్, ముర్రాజాతి పశువుల పాలపోటీలు, ఒంగోలు, పుంగనూరుజాతి ఆవులు, గిత్తలు, పెయ్యలకు అందాలపోటీలు జరుగుతాయని వెల్లడించారు. మోపురం, రంగులను పరిశీలించి శాస్త్రీయపద్ధతిలో నిపుణులైన న్యాయనిర్ణేతల పర్యవేక్షణలో పోటీలు జరుగుతాయని చెప్పారు. గతంలో తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో నిర్వహించిన పోటీలకు తెలంగాణకు చెందిన పశువులు వచ్చాయని, ఈ ఏడాది గుజరాత్, మధ్యప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, పంజాబ్ రాష్ట్రాల పశువులూ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉందని పేర్కొన్నారు. బండలాగుడు పోటీల్లో 70 జతల ఎద్దులు, ఆవుల ప్రదర్శనలో 400 నుంచి 800 గోవులు, పాలదిగుబడి పోటీల్లో 700 గోవులు, గేదెలు పాల్గొంటాయని వివరించారు. రోజూ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పోటీలు జరుగుతాయన్నారు. ముగింపు ఉత్సవంలో నిస్వార్థంగా సేవలందించిన వెటర్నరీ అధికారులకు సన్మానం చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో కనుమూరి అబ్బాయిరాజు, భూపతిరాజు విజయరామరాజు, యాదగిరి నారాయణరావు, కొండ్రెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మట్లాడుతున్న శ్రీరంగనాథరాజు తదితరులు

## చినవెంకన్న గ్రామోత్సవం

ద్వారకాతిరుమల:

ఉభయ దేవేరులతో కలిసి చినవెంకన్న తొళక్క వాహనంపై క్షేత్ర పురవీధుల్లో మంగళవారం ఊరేగారు. ధనుర్మాసం సందర్భంగా గజసేవ మధ్య నిర్వహించిన ఈ గ్రామోత్సవం నేత్రపర్వంగా సాగింది. అనంతరం స్థానిక విలాస మండపంలో స్వామి, అమ్మవార్లను ఉంచి అర్చకులు విశేష పూజలు చేశారు.



## రేపు, ఎల్లుండి విద్యార్థి సింపోజియం

భీమవరం : భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్(ఈసీఈ) విభాగం ఆధ్వర్యంలో ఈనెల 4,5 తేదీల్లో జాతీయ స్థాయి విద్యార్థి సింపోజియం నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.పార్థసారథివర్మ తెలిపారు. మంగళవారం కళాశాలలో సింపోజియమ్ పోస్టర్‌ను కళాశాల డైరెక్టర్ సాగి విఠల్ రంగరాజు ఆవిష్కరించారు. ప్రోగ్రామ్ కన్వీనర్ డాక్టర్ పీవీ రామరాజు కార్యక్రమ వివరాలు వెల్లడించారు. గురువారం సింపోజియం ప్రారంభోత్సవానికి బెంగళూరు హెచ్ఏఎల్ ఛీఫ్ మేనేజర్ డి.శ్రీనివాసరావు, శుక్రవారం ముగింపు కార్యక్రమానికి జూనిఫర్ నెట్‌వర్క్ స్టాఫ్ ఇంజినీర్ ఎ.రాజకృష్ణ హాజరవుతారని, రెండురోజులు విద్యార్థులకు వివిధ విభాగాల్లో పోటీలు, వర్క్‌షాప్ ఉంటాయని వివరించారు.





## 5న నన్నయ్య వర్సిటీలో జాబ్‌మేళా

జంగారెడ్డిగూడెం : ఏపీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆధ్వర్యంలో ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ, వికాస సంస్థలు సంయుక్తంగా ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు విద్యావేత్త అలుగు ఆనందశేఖర్ తెలిపారు. మంగళవారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 5న శుక్రవారం రాజమండ్రి ఆదికవి నన్నయ్య యూనివర్సిటీలో 30కిపైగా కార్పొరేట్ సంస్థలు ఈ జాబ్‌మేళా నిర్వహిస్తాయని వెల్లడించారు. పదో తరగతి నుంచి పీజీ వరకూ చదివిన ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులు ఈ జాబ్‌మేళాను వినియోగించుకోవాలని సూచించారు.




Praja Sankalpa Yaatra

## అన్నను చూడాలని..


ఆయిల్ ట్యాంకర్‌పైకి ఎక్కిన అభిమానులు

## అభిమాన రథం


బస్సుపై నుంచి అభివాదం చేస్తూ..

## కొండంత సంతోషం


వాల్మీకిపురం సమీపంలో...

## గూడు కట్టిన ఆప్యాయత


జననేతను చూసేందుకు భవనంపైకి చేరుకున్న ప్రజలు


వెల్లివిరిసిన ఆనందం..


అవ్వకు ఓదార్పు..


భరోసానిస్తూ..



బాదంపప్పును స్వీకరిస్తూ..


ఊరికి పండగొచ్చింది.. వాల్మీకిపురంలో స్వాగత తోరణాలు


ధైర్యాన్నిస్తూ..

బ్రహ్మరథం.. వాల్మీకిపురంలో రాష్ట్ర ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అపూర్వ స్వాగతం పలుకుతున్న ప్రజలు, అభిమానులు

# అలుపెరుగని అడుగులు



ఉద్యోగ భద్రత లేని ఉపాధ్యాయులు
వేతన అగచాట్లతో సంఘమిత్రలు
గిట్టుబాటు ధరలేని రైతులు
హంద్రీ–నీవా కోసం ఎదురు చూస్తున్న జనాలు
జననేతను కదిలించిన పడమట అంశాలు

అలుపెరుగని యాత్రలో..
50 రోజుల ప్రయాణంలో..
700 కిలోమీటర్లు దాటిన తరుణంలో..
జనం అడుగడుగునా నీరాజనాలు పలికారు.
ప్రజాసంకల్ప యాత్రికుడు జగన్‌మోహన్‌రెడ్డికి
మంగళవారం బ్రహ్మరథం పట్టారు.


పూలవాండ్లపల్లె శివారులో వినతులు అందుకుంటూ..


అన్నయ్యతో ఆత్మీయ సెల్ఫీ


సమస్యలు తెలుసుకుంటున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అన్నదాత నవ్వాలి..
కాశీరావు పేటలో జననేత వెంట నడుస్తున్న రైతన్న

### ఆనంద హేల


వాల్మీకిపురం సమీపంలో అభిమానుల సందడి

### మమతానురాగం


జగనన్నను కలసిన అక్కాచెల్లెమ్మలు


ఆత్మీయ స్పర్శ.. జననేతతో కరచాలనం చేస్తూ..


అన్నొస్తున్నాడని.. వాల్మీకిపురంలో స్వాగతం పలికేందుకు నిరీక్షణ

## కష్టాలు తెలుసుకుంటూ..


వాల్మీకిపురంలో సమస్యలు విన్నవిస్తున్న సోదరి

## తీపి జ్ఞాపకం


జననేతతో సెల్ఫీ తీసుకుంటున్న చెల్లెమ్మ

## అక్షర స్వాగతం


అన్నయ్యకు పూల స్వాగతం

## ఆత్మీయ పలకరింపు


కాశిరావుపేటలో అక్కాచెల్లెమ్మలను పలుకరిస్తూ..

## హద్దులు దాటిన అభిమానం


జననేతతో కర్ణాటక రాష్ట్ర బస్సు కండక్టర్

## ఉద్యోగ భద్రత కల్పించాలి

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలల్లో (ఏపీఆర్ఎస్) కాంట్రాక్టు రిసోర్స్ టీచర్స్ (సీఆర్‌టీ)గా పనిచేస్తున్న ఉపాధ్యాయుల్ని క్రమబద్ధీకరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వాల్మీకిపురానికి చెందిన అరుణకుమారి, సోఫియాబేగం తదితరులు ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మంగళవారం ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా వాల్మీకిపురం వద్ద వారు ఆయనను కలిసి సమస్యలు ఏకరువు పెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా సీఆర్‌టీలకు బేసిక్ వేతనాలు ఫిక్స్ చేసిన ఘనత అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డిదేనన్నారు. రాష్ట్రంలో ఉన్న 76 గురుకుల పాఠశాలల్లో 236 మంది సిబ్బంది 2001 నుంచి సీఆర్‌టీలుగా పనిచేస్తున్నారని, తమను రెగ్యులరైజ్ చేయడానికి ప్రభుత్వం చొరవ చూపడం లేదని వాపోయారు.– చిత్తూరు అర్బన్



## జననేతను చూడాలని..

వాల్మీకిపురంలో సురేష్‌కు చిన్న హోటలే జీవనాధారం. రెండు నెలల క్రితం మధుమేహ వ్యాధి ఎక్కువ కావడంతో చికిత్స కోసం కుటుంబ సభ్యులు అతన్ని బెంగళూరులోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో అతని కుడికాలును వైద్యులు తొలగించారు. అక్కడే చికిత్స పొందుతున్న సురేష్‌కు మంగళవారం తమ ఊర్లోకి జననేత వస్తున్నారని తెలిసింది. ఒక్కసారైనా తమ అభిమాన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డిని చూడాలని నిశ్చయించుకున్నాడు. కుటుంబ సభ్యులపై ఒత్తిడి పెంచి సోమవారమే ఇంటికి చేరుకున్నాడు. జగనన్నను కలిసి తన ముచ్చట తీర్చుకున్నాడు. ఇది తన జీవితంలో చిరకాలం గుర్తుండిపోతుందని సంతోషం వ్యక్తం చేశాడు.



## దేశయ్య సంతోషం!

“నేను పుట్టు గుడ్డివాడిని. జనాల బాధల్ని తెలుసుకునేందుకు ఎక్కడి నుంచో జగనన్న వస్తా ఉండాడని తెలుసుకున్నా. ఆయన్ను ఎట్టా చూడలేను. కనీసం ఆ సామి గొంతు వింటే సాలనుకున్నా. కానీ అన్న నన్ను తాకినాడు. నాతో మాట్లాడినాడు. నా బాగోగులు అడిగినాడు. ఇంతకన్నా ఏం కావాలి సామీ..” అంటూ వాల్మీకిపురానికి చెందిన దేశయ్య తన సంతోషాన్ని వ్యక్తంచేశారు. ఆయన తన పిన్ని ఈశ్వరమ్మతో కలిసి రోడ్డు పక్కన నిలబడి జననేత కోసం ఎదురు చూస్తున్నాడు.. ప్రజాసంకల్పయాత్రలో భాగంగా అటువైపు వెళుతున్న జగన్‌మోహన్ రెడ్డి తన దగ్గరకు వచ్చి హత్తుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకోవడంతో ఆయన పట్టరాని ఆనందానికి లోనయ్యారు.



## పరిహారం ఇవ్వలేదన్నా

“అన్నా.. మాకుండేదే 30 గుంటలు. పొలాల్లో రోడ్డు వేయాలి.. భూములు తీసుకుంటామని అధికారులు నోటీసులిచ్చారన్నా. భూమికి ఎంత పరిహారం ఇస్తారు.. ఎప్పుడిస్తారు..? అని కూడా చెప్పలేదు..” అంటూ మదనపల్లె రూరల్ మండలంలోని అండవారి పల్లెకు చెందిన సుజాత తదితరులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. పూలవాండ్లపల్లె సమీపంలో వారు జననేతను కలిశారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పంట పొలాలు తీసుకుంటున్నారని, దీనికి ప్రత్యామ్నాయంగా తమకు మరెక్కడైనా భూములతో పాటు పరిహారం కూడా ఇచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.



## ఊరి చివరనే పూరిపాకలు

‘సామీ మాది ఊరి బయట ఉన్న ఎస్సీ కాలనీ. పదిహేనేళ్లకు పైగా ఇక్కడే ఉన్నాం. రోడ్లు లేవు. నీళ్లు రావు. చాలా మందికి సొంతిళ్లు కూడా లేవు’ అంటూ మదనపల్లె రూరల్‌కు చెందిన సుగుణ ఇతర మహిళలు ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించుకున్నారు. ప్రజాసంకల్పయాత్రలో భాగంగా తమ ఊరి చివర వేచి ఉన్న మహిళల్ని జగన్‌మోహన్ రెడ్డి ఆప్యాయంగా పలకరించారు. కొంత దూరం ఆయనతో కలసి నడిచిన మహిళలు గ్రామంలోని సమస్యల్ని వివరించారు. ఎస్సీ కాలనీల్లో మౌలిక వసతులు, సదుపాయాలు కల్పించాలన్నారు.

